

జవసత్వాలు!

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి

జిల్లాలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ కేంద్రాలను పునః ప్రారంభించి జవసత్వాలను నింపింది. జిల్లా వ్యాప్తంగా 479 కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఇప్పటికే 50పైగా కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు అత్యధిక ఆదాయం పొందిన పంచాయతీగా చల్లపల్లి నిలిచింది. త్వరలో మరిన్ని పంచాయతీలు ఇదే బాటలో పయనించనున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 479 కేంద్రాల ఏర్పాటు

- 50కిపైగా కేంద్రాల్లో కంపోస్టు ఎరువు తయారీ
- కిలో రూ.10కి విక్రయం.. చల్లపల్లిలో అత్యధిక సంపాదన
- చల్లపల్లిని సందర్శించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బృందం





నందివాడలో వర్మీకంపోస్టు తయారీలో కార్మికులు (ఇన్‌సెట్‌లో) చల్లపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 474 గ్రామ పంచాయతీల్లో 479 చెత్త నుంచి సంపదను తయారు చేసే కేంద్రాలను నిర్మించారు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వీటిని ఏర్పాటు చేశారు. స్వచ్ఛ ఆంధ్రా మిషన్ ద్వారా ప్రతి వెయ్యి మంది జనాభాకు చెత్త సేకరణ కోసం ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. వీరు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు తరలించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను అంతగా పట్టించుకోలేదు. దీంతో ఈప్రక్రియకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గత ఆగస్టులో జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు పంచాయతీ సమావేశాలు నిర్వహించి, అంతర్గత రహదారుల నిర్మాణంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు మరమ్మతులు చేయడం, నూతన కేంద్రాల నిర్మాణం చేయడానికి ఆమోదం తెలిపారు. జిల్లాలోని 479 కేంద్రాల్లో 50కిపైగా చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారై విక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన వాటి నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసే పనులను ప్రారంభించే దశలో ఉన్నాయి.

చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారీ ఇలా

చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేయడానికి జిల్లాలోని ఆయా పంచాయతీల్లో సామర్థ్యాన్ని బట్టి షెడ్‌లను, పిట్‌లను నిర్మాణం చేశారు. గ్రీన్ అంబాసిడర్‌లు తడిచెత్తను, పొడిచెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. తడిచెత్తను పిట్‌లలో వేసి చదును చేసి దానిపై పేడను వేస్తారు. 45 నుంచి 65 రోజుల పాటు రోజూ నీటిని పోస్తారు. ఈ చెత్త కుళ్లిపోతుంది. దీనిని షెడ్‌లలో ఉన్న పిట్‌లలో లేయర్లుగా వేసి అందులో మిగతా 6లో..

మోడల్ కేంద్రంగా చిట్టిపాలెం

జిల్లాలో ప్రతి రెండో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ, దానిని చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించడం, వర్మీకంపోస్టును తయారు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ బాలాజీ మచిలీపట్నం మండలం అరిసేపల్లి పంచాయతీ పరిధిలోని చిట్టిపాలెంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఇటీవల పరిశీలించారు. చెత్త నుంచి సంపదను తయారు చేసే విధానంపై చిట్టిపాలెంలోని కేంద్రాన్ని మోడల్‌గా ఆయన ప్రకటించారు. ఈ కేంద్రంలో చెత్తనుంచి సంపద తయారు చేసే పద్ధతిపై మిగిలిన పంచాయతీలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలోనే చల్లపల్లికి ప్రథమ స్థానం

చెత్త నుంచి సంపద తయారీలో చల్లపల్లి పంచాయతీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పంచాయతీ వర్మీకంపోస్టును విక్రయించి రూ.1.80 లక్షలను ఆదాయంగా పొందింది. ఇటీవల కలెక్టర్ బాలాజీ చల్లపల్లి పంచాయతీని సందర్శించి చెత్త నుంచి సంపద తయారీ విధానాన్ని పరిశీలించారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పీవీ మాధవేంద్రరావుకు ప్రత్యేక ప్రశంసాపత్రాలతో పాటు స్మార్ట్‌వాచ్‌లను బహుమతిగా అందజేశారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమ రూపకర్తలు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులను, స్వచ్ఛ చల్లపల్లి సారథులను ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్, ఎండీల ఆదేశాల మేరకు చల్లపల్లి గ్రామాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బృందం గురువారం పరిశీలించింది. పదేళ్లుగా జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం గురించి తెలుసుకుని స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిని రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు తెలియచేసే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ నేతృత్వంలోని బృందం సభ్యులు గురువారం తెల్లవారుజామున స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛ సారథులు పనిచేస్తున్న తీరును పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా చల్లపల్లిని ఆదర్శంగా తీసుకునే విధంగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని వారు తెలిపారు.

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్

కస్తూరిబాయి రాజీనామా

మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందజేత

- అన్యాయం చేసిన వాళ్లని ఆ దేవుడే చూసుకుంటాడంటూ భావోద్వేగం
- వివాదం సద్దుమణుగుతుందా ? కొత్త వివాదం తలెత్తుతుందా?



మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందిస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి

తిరువూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అనేక రాజకీయ పరిణామాల మధ్య తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి తన పదవికి రాజీనామా చేశారు. 'పై నుంచి భగవంతుడు చూస్తున్నాడు. నాకు అన్యాయం చేసిన వాళ్లని ఆయనే చేసుకుంటాడు' అంటూ భావోద్వేగంతో మాట్లాడారు. గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కస్తూరిబాయి తన పదవికి రాజీనామ చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్ లోవరాజుకు ఆయన చాంబర్‌లో తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరి బాయి మాట్లాడుతూ 2021లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి మాల సామాజిక వర్గానికి చెందిన తనను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రకటించారని తెలిపారు. అప్పటి స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తన పట్ల ద్వేషంతో ఐక్యంగా ఉన్న కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టారని ఆరోపించారు. తిరువూరు పట్టణంలో డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌ను రూపొందించకుండా అడ్డుపడి, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.4 కోట్లు నిధులు వెనక్కి వెళ్లేందుకు మిగతా 6లో..

ఏడాది పాలనను కుంటుపడేశారు..

ప్రజలు వైసీపీకి ఐదేళ్ల అధికారం ఇస్తే పదవి కోసం కుమ్ములాడుకుంటూ ప్రజా సమస్యలు, అభివృద్ధిని విస్మరించారని టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ షేక్ అబ్దుల్‌హుస్సేన్ విమర్శించారు. బోర్డు పాలన మరో సంవత్సరం మాత్రమే ఉందని చెప్పారు. ఇప్పుడు చైర్‌పర్సన్ రాజీనామా చేయడం వల్ల తిరిగి మరొకర్ని చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు ఎంతకాలం పడుతుందోనన్నారు. అప్పటి వరకు పాలన కుంటుపడుతుందని వివరించారు.

వాటా కోసం వచ్చి ప్రాణాలు తీసుకుంది!

'తండ్రి' బీమా సొమ్ములో వాటా అడిగిన కుమార్తె

- మరొకరితో సహజీవనం చేస్తూ కుదరదన్న తల్లి
- ప్రియుడితో కలిసి కుమార్తెపై దూషణలు
- మనస్తాపంతో తల్లి ఇంటికి సమీపంలో ఆత్మహత్య





ఆస్పత్రిలో మౌనిక మృతదేహం

విజయవాడ/చిట్టినగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణించడంతో తల్లికి వచ్చిన బీమా సొమ్ములో వాటా తీసుకోవడానికి వచ్చిన కుమార్తెను తల్లి, తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి దూషించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయవాడలో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే... చిట్టినగర్‌కు చెందిన గుత్తికొండ రమాదేవి భర్త మోహనరావు కొద్దినెలల క్రితం చనిపోయాడు. ఆయన చెల్లించిన బీమాకు సంబంధించి రూ.8లక్షలు రమాదేవికి అందాయి. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె విజయలక్ష్మి తల్లి ఇంటికి సమీపంలో ఉంటోంది. చిన్న కుమార్తె కామిశెట్టి మౌనిక భర్తతో కలిసి విశాఖపట్నంలో నివాసం ఉంటోంది.

కుమార్తెపై పోలీసులకు తల్లి ఫిర్యాదు

తండ్రి బీమా సొమ్ములు తల్లికి అందాయన్న విషయం తెలుసుకున్న మౌనిక కొద్దిరోజుల క్రితం తల్లి రమాదేవి వద్దకు వచ్చింది. అప్పుడప్పుడు సమీపాన ఉన్న అక్క విజయలక్ష్మి ఇంటికి వెళ్లి వస్తోంది. భర్త మరణించిన తర్వాత రమాదేవి వెంకటేశ్వరరావు అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ విషయం తెలిసి అనేక సార్లు తల్లిని మౌనిక మందలించింది. విశాఖకు వచ్చి తన వద్ద ఉండాలని చెప్పింది. దీన్ని రమాదేవి పెద్దగా పెట్టించుకోలేదు. ఈ క్రమంలో మౌనిక తనకు రావాల్సిన వాటా ఇవ్వాలని తల్లి రమాదేవిని గట్టిగా మిగతా 6లో..

తల్లీ కుమార్తెల మధ్య రాజీ కోసం లంచం

కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటాద్రిపై పలు ఆరోపణలు వస్తున్నాయి. మార్చి 30వ తేదీన రమాదేవి నుంచి ఫిర్యాదు తీసుకున్న తర్వాత స్టేషన్‌కు రావాలని పలుమార్లు ఆయన మౌనికకు ఫోన్లు చేశారు. దీనికి ఆమె వస్తానని జవాబు ఇస్తూనే రోజులు గడిపింది. తర్వాత వెంకటాద్రి ఫోన్ చేసి ఈ కేసును రాజీ చేస్తానని మౌనికకు భరోసా ఇచ్చారు. దీనికి సంబంధించి ఆమె నుంచి కొంత మొత్తాన్ని ఫోన్‌పే చేయించుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని మౌనిక సోదరి విజయలక్ష్మి, బంధువులు చెబుతున్నారు. ఫోన్‌పే వ్యవహారం ఇన్‌స్పెక్టర్ కొండలరావు దృష్టికి వెళ్లింది. దీనిపై ఆయన అంతర్గతంగా విచారణ చేశారు. ఫోన్‌పే ఆరోపణల్లో వాస్తవం ఉందని ఆయన నిర్ధారించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

అభివృద్ధిపై అక్కసు!

గ్రామాభివృద్ధిని అడ్డుకునేలా వైసీపీ రాజకీయాలు!

ఐనంపూడి పంచాయతీలో పనుల వివాదం

- కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా రూ.20 లక్షలు మంజూరు
- పనులు చేసేందుకు తీర్మానం చేయని పంచాయతీ పాలకవర్గం
- కమీషన్ల కోసం నామినేషన్ విధానంలో కేటాయించేందుకు చర్యలు
- రూ.7 లక్షలు లంచం అడుగుతున్నారని టీడీపీ నాయకుల ఆరోపణలు
- గ్రామాభివృద్ధి కోసం ఉభయులు పాటు పడాల్సిందిగా గ్రామస్థుల హితవు





ఐనంపూడి పంచాయతీ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) గ్రామ సర్పంచ్ బట్టు పరంజ్యోతి

పామర్రు, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజకీయాలు గ్రామాభివృద్ధిని కూడా అడ్డుకునే స్థాయికి దిగజారాయి. పామర్రు మండలం ఐనంపూడి గ్రామంలో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి రూ.20 లక్షల కేంద్ర ప్రాయోజిత పథక నిధులు మంజూరైనా వాటిని ఖర్చు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న తలంపు అధికార వైసీపీ పాలకవర్గానికి తట్టడం లేదు. గతంలో మాకు పనులు ఇవ్వలేదు కాబట్టి.. ఇప్పుడు మేమే పనులు చేసుకుంటామని పాలకవర్గం భీష్మించుకుని కూర్చుంది. మంజూరైన నిధులను ఖర్చు చేయకుండా తాత్సారం చేస్తోంది. మంచినీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులను అడ్డుకుంటోంది. నామినేషన్ల ప్రాతిపదికన తమ వాళ్లకు పనులు అప్పగించేందుకు ముందు రంగం సిద్ధం చేసినా.. ఆ తర్వాత తేడాలు రావటంతో వాటిని పక్కనపెట్టారు. ఈ పనులను చేపట్టేందుకు పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకు వచ్చి తీర్మానాన్ని ఆమోదించే ప్రయత్నం కూడా చేయటం లేదు. తీర్మానాన్ని ప్రవేశపెడితే పనులు చేపట్టాల్సి వస్తుందన్న ఉద్దేశ్యంతో వైసీపీ సర్పంచ్ బట్టు పరంజ్యోతి మిన్నుకుండిపోతున్నారు. వైసీపీ సర్పంచ్ భర్త కూడా ఈ పనులు జరగకుండా అడ్డుపడుతున్నాడన్న విమర్శలు వస్తున్నాయి. పనులు చేపట్టాలంటే ఔటరేట్‌గా రూ.7 లక్షలు ఇస్తేనే తీర్మానం ఆమోదం మిగతా 6లో..

ఈ నిధులు ఎంతో అవసరం

ఐనంపూడి గ్రామానికి మొత్తం రూ.20లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రూ.14లక్షల నిధులతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు రూ.5 లక్షల వ్యయంతో డ్రైనేజీ అభివృద్ధి, మరో రూ.లక్ష నిధులతో తాగునీటి పైపుల లీకులను అరికట్టడానికి కొత్త పైపులైన్ల నిర్మాణం కోసం వినియోగించవలసి ఉంది. మండలంలో మైనర్ పంచాయతీ అయిన ఐనంపూడి గ్రామం దాదాపు 791 మంది గ్రామ జనాభా కలిగి ఉంది. వారిలో 501 మంది దళితులు, 290 మంది ఇతరులు ఉన్నారు. 2020-21 మధ్యలో జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల పోరులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి బట్టు పరంజ్యోతి ఎన్నికయ్యారు. ఆ తర్వాత గ్రామాభివృద్ధి పేరుతో వైసీపీ పంచన చేరారు. గ్రామాభివృద్ధి పనుల విషయంలో చొరవ చూపించకపోవటంతో స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. చేపట్టాల్సిన పనుల విషయంలో సాగదీత వల్ల నష్టం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పర్యాటక కేంద్రంగా మంగినపూడి బీచ్

- బీచ్‌ను సందర్శించిన మంత్రి రవీంద్ర, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్

8లో

శివరూపిణీ నమోస్తుతే..

- కనకదుర్గమ్మకు వైభవంగా పుష్పార్చన



6లో

పర్యాటక బాట.. బందరు కోట!

- పునరుద్ధరణ పనులు పరిశీలించిన కలెక్టర్ బాలాజీ



గొల్లమంద వద్ద నదిలోకి జారిపోతున్న భూమి

కడలి కోత!

ఎదురుమొండి-గొల్లమంద రహదారికి మోక్షమెప్పుడో?

- నదీగర్భంలో కలిసిపోతున్న దీవులు
- రూ.13.45 కోట్లు మంజూరైనా కాగితాలు దాటని రహదారి పనులు
- అలల తాకిడికి తీవ్రమవుతున్న కోత
- ప్రమాదకర ప్రాంతంలోనే ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు

6లో

కండ్రికలో చెరువు లీజు దందా!

64వ డివిజన్‌లో 23 ఎకరాల చెరువు

- కార్పొరేషన్ అనుమతి లేకుండా చెరువు కమిటీ పేరుతో లీజుకు..
- ఐదేళ్లకు రూ.25 లక్షలకు లీజు అగ్రిమెంటు
- చెరువులో చేపల పెంపకం.. ఆహారంగా వ్యర్థాల వినియోగం
- స్థానికుల పొలాలు, పశువులకు నీరు ఇవ్వకుండా అడ్డగింత



లీజుకు ఇచ్చిన 23 ఎకరాల చెరువు

పాయకాపురం/వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలో సుమారు 23 ఎకరాల చెరువు ఉంది. స్థానికంగా ఉన్న కొందరు కార్పొరేషన్ అనుమతి లేకుండా చెరువు కమిటీ పేరుతో వేరే వ్యక్తులకు ఏడాదికి రూ.5లక్షలు చొప్పున ఐదేళ్లకు గాను రూ.25 లక్షలకు లీజుకు ఇచ్చారు. లీజుదారులు ఆ చెరువులో చేపల పెంపకం చేపట్టారు. వ్యర్థాలను చేపల మేత కోసం వినియోగిస్తున్నారు. చెరువులోని నీటిని స్థానిక పొలాలకు, పశువులకు ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో కండ్రిక, పాతపాడు ప్రాంతాల్లో ఉన్న సుమారు రెండు వేల పశువులకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాయి. పశువుల యజమానులు, రైతులు పలుసార్లు లీజుదారులతో మాట్లాడి చెరువులో వ్యర్థాలు వేయవద్దని కోరినా వారు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారుల అనుమతి లేకుండా కొందరు చెరువు కమిటీ పేరుతో చెరువును లీజుకు ఇవ్వటమేమిటని ప్రశ్నిస్తున్నారు. వేసవి కాలంలో నీరు అందుబాటులో లేకపోవటం వలన పశువులు ఇబ్బందులు పడుతున్నాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అనుమతి లేకుండా చెరువును లీజుకు ఇచ్చి, కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం బూడిద చెరువుకు వెళ్లే దారిలో దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో తడిపిన నీటి గుంతలో దాహార్తి తీర్చుకుంటున్న వానరాలు

గొంతు ఎండతోంది!



గోలిసోడాతో గొంతు తడుపుకుంటున్న బాలుడు

రోజు రోజుకీ ఎండలు తారెత్తిస్తున్నాయి.. వేసవి తాపానికి మనుషులే కాదు.. సకల జీవరాశులు అల్లాడుతున్నాయి. గుక్కెడు నీటికోసం తహతహలాడుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ప్రాణాలు నిలుపుకునేందుకు మనుషులు శీతల పానీయాల వైపు చూస్తుంటే.. గుక్కెడు నీరు దొరికితే చాలు గొంతు తడుపుకుంటాం.. దేవుడా! అంటూ వానరాలు గుంతల్లో నీటికోసం పరుగుపెడుతున్నాయి. ఉష్ణ తాపం తాళలేక పశువులు కాలువల్లో నుంచి బయటకు రావడంలేదు.

- ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి



కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య బుడమేరు డైవర్షన్ కెనల్ నీటిలో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్న పశువులు



తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మల్లెలు, మందార పుష్పాలతో అర్చన

శివరూపిణీ నమోస్తుతే..

» కనకదుర్గమ్మకు వైభవంగా పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చైత్రమాస నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక పుష్పార్చనల కార్యక్రమంలో ఐదో రోజైన గురువారం తెల్లజిల్లేడు, మారేడు, తులసి దళాలు, మల్లెలు, మందార పుష్పాలతో అర్చించారు. దుర్గమ్మను శివరూపిణిగా కూడా కొలుస్తారు. శివుడిగా భావించి మారేడు పత్రాలతో పూజిస్తారు. దుర్గా స్వరూపం త్రిమూర్తుల



దివ్యశక్తుల నుంచి ఆవిర్భవించింది. దుష్టసంహారం కోసం ప్రత్యేక అవతారం దాల్చారు. ఆ సమయంలో నవరూపాలను ధరించారు. త్రిమూర్తుల ప్రత్యేక తేజస్సు నుంచి అవతరించటంతో ఆమెకు తెల్లజిల్లేడు పూలు, తులసీదళాలు కూడా సమర్పించడం జరుగుతుంది. భక్తుల మనస్సుల్లో ఉండాలని కోరుకుంటూ మల్లెలను సమర్పించారు. పూజల్లో ఈవో రామచంద్రమోహన్, స్థానాచార్యుడు వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ కానుకల లెక్కింపు..

దుర్గమ్మకు భక్తులు సమర్పించిన కానుకలు 15 రోజులకుగాను ఈవో పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. రూ.2,18,00,698 నగదు, 355 గ్రా. బంగారం, 6కిలోల 374గ్రా. వెండి సమకూరింది.



అధికారులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

సుబ్బారాయుడి సేవలో ఎన్నికల అధికారులు

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు గురువారం ఉదయం దర్శించుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ చీఫ్ అధికారి విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సెక్రటరీ రామారావుల బృందం ఆలయాన్ని సందర్శించగా, అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ ఎన్.శ్రీవిద్యలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే కాగిత

ఒర్లగొంది తిప్పలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కృత్తివెన్ను, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అవిష్కరించటం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఒర్లగొందితిప్ప గ్రామంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు అవిష్కరించారు. దాతలను గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఒడుగు తులసీరావు, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

చిరుజల్లులు.. రైతు గుండెల్లో గుబులు!

వత్సవాయి : వత్సవాయిలో గురువారం చిరుజల్లులు పడ్డాయి. మిర్చి, మొక్కజొన్న రైతులు కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు పరుగులు పెట్టారు. మిర్చి పంట 7 వేలు, మొక్కజొన్న 1,500 ఎకరాల్లో సాగుచేసి కోయించి కల్లాల్లో ఆరబెట్టారు. ఉరుములతో కూడిన జల్లులు పడటంతో పంటలపై పట్టాలు కప్పి కాపాడుకున్నారు. ఇప్పటికే ధరలు లేక అల్లాడుతున్న రైతులు వర్షానికి పంట తడిస్తే ధర పడిపోతుందని తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



కల్లాల్లో మిర్చి పంట

కడలి కోత!

ఎదురుమొండి-గొల్లమంద రహదారికి మోక్షమెప్పుడో?

(అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గంలో దివి గ్రామసమూహమైన ఎదురుమొండి దీవుల్లో సముద్రపు ఆటుపోట్ల కారణంగా ఏర్పడిన భూమి కోత నివారణ కోసం ఎదురుమొండి-గొల్లమంద నడుమ రహదారి నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించి నెలలు గడుస్తున్నా పనులు కాగితాలకే పరిమితమవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు.. నది గమన దిశలో అనూహ్య మార్పుల కారణంగా గడిచిన ఆరేళ్లుగా ఎదురుమొండి దీవులు సముద్రపు ఆటుపోట్లు కారణంగా కోతకు గురవుతున్నాయి. దీనికి తోడు ప్రతీ ఏటా క్రమం తప్పకుండా వస్తున్న భారీ వరదలు కోతను మరింత తీవ్రతరం చేయటంతో ఎదురుమొండి-గొల్లమంద గ్రామాల నడుమ దాదాపు 30మీటర్ల మేర వెడల్పు దాదాపు కిలోమీటరు పొడవున భూమి కోతకు గురైంది. కృష్ణానది బ్యాక్ వాటర్ పాయ రహదారి సైతం కనుమరుగైంది. కోత కారణంగా రహదారి పూర్తిగా నదిలో కలసిపోయే పరిస్థితి రావటంతో వైసీపీ

» నదీగర్భంలో కలిసిపోతున్న దీవులు
» రూ.13.45 కోట్లు మంజూరైనా కాగితాలు దాటని రహదారి పనులు
» అలల తాకిడికి తీవ్రమవుతున్న కోత
» ప్రమాదకర ప్రాంతంలోనే ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు

ప్రభుత్వ హయాంలోనే రూ.1.7 కోట్లతో అంచనాలు రూపొందించారు.. అయితే పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ వరదల కారణంగా కోత మరింత తీవ్రం కావటంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి పంటుపై గొల్లమంద ప్రాంతాన్ని పరిశీలించారు. కోత నివారణ చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్కడి పరిస్థితిని డ్రోన్ ద్వారా వీడియో తీసి ప్రభుత్వానికి పంపడంతో కోత నివారణకు ఎదురుమొండి నుంచి గొల్లమంద వరకు రహదారిని నిర్మించాలని, కోత తీవ్రంగా ఉన్న ప్రాంతంలో సాంకేతికతను వినియోగించి ఆటుపోట్ల ప్రవాహ వేగాన్ని నియంత్రించాలని ప్రభుత్వం భావించింది. దీనిలో భాగంగానే రూ.13.45 కోట్లు మంజూరయ్యాయని జనవరిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు.



గొల్లమంద వద్ద నదిలోకి జారిపోతున్న భూమి



కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

● కాగితాలు దాటని పనులు

ఎదురుమొండి-గొల్లమంద మధ్య ఏర్పడిన కోత నివారణ కోసం ఎదురుమొండి-జింకపాలెం గ్రామాల మధ్య ఉన్న పాత రహదారిని అభివృద్ధి పర్చటంతో పాటు దాదాపు కిలోమీటరు మేర నదిలో కలిసిపోయిన ప్రాంతంలో భూ సేకరణ చేసి అక్కడ కొత్త రహదారిని నిర్మించాలని ప్రభుత్వం భావించింది. త్వరలోనే శంకుస్థాపన జరుగుతుందని, కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు.. కానీ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. రెండు నెలలపాటు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా టెండర్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడినా.. ఎన్నికలు ముగిసి నెలరోజులు కావొస్తున్నప్పటికీ పనులకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి ముందడుగు పడకపోవటం పట్ల దీవుల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ఈ మూడు నెలలే కీలకం

ఎదురుమొండి-గొల్లమంద గ్రామాల మధ్య ఏర్పడిన కోత విషయంలో ఏ పనులు నిర్వహించాలన్నా ఈ మూడు నెలలే కీలకమని, ఆ తర్వాత పనులు నిర్వహించాలంటే వర్షాలు, వరదలు పనులకు ఆటంకం కలిగిస్తాయని, ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలని ఎదురుమొండి వాసులు కోరుతున్నారు. గడిచిన ఆరేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి వెళుతున్నారే గానీ పనులు ప్రారంభం కావటం లేదని, కూటమి ప్రభుత్వంలో రూ.13.45 కోట్లు మంజూరైనా పనులను ఇంకా ఎందుకు ప్రారంభించటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కోత అటవీ భూముల వరకు చేరుకుందని, అది కొద్ది అడుగులు పెరిగితే ఆ ప్రాంతంలో భూ సేకరణకు కూడా అటవీ నిబంధనల కారణంగా వీల్లేని పరిస్థితి ఏర్పడుతుందని దీవుల వాసులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన ఆగస్టు నుంచి ఇప్పటి వరకు దాదాపుగా మరో ఏడు అడుగుల వెడల్పున కోత పెరిగిందని, నెలరోజుల్లో పనులు ప్రారంభించకుంటే కోత అటవీ భూముల వరకు చేరుకుంటుందని, అదే జరిగితే ఎదురుమొండి-జింకపాలెం గ్రామాల నడుమ రహదారి ఊసే మరిచిపోవాల్సిన పరిస్థితి వస్తుందని గొల్లమంద, జింకపాలెం, బ్రహ్మయ్యగారి మూల ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల మరింతగా కోత

● ప్రమాదకర ప్రాంతాల్లోనే తవ్వకాలు

ఓ వైపు ఎదురుమొండి దీవుల మనుగడ ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో గొల్లమంద సమీపంలోనే కొందరు అక్రమార్కులు ప్రతినిత్యం ఇసుక, బుసక తవ్వకాలు సాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో గొల్లమంద ప్రాంతంలో కోతకు గురైన చోట ఇసుక, బుసకను తవ్వి తీసి అమ్ముకుంటున్నారని, దీని కారణంగా కోత మరింతగా పెరగటంతోపాటు భూమి కరుగుదల వేగం ఎక్కువవుతున్నదని, అధికారులు స్పందించి ఎదురుమొండి దీవుల చుట్టూ నదిలో నుంచి ఇసుక, బుసక వెలికి తీయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజధాని రైతులకు ఈ లాటరీలో 494 ప్లాట్ల కేటాయింపు

విజయవాడ కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 197 మంది రైతులకు గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ లాటరీ విధానం ద్వారా 494 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 297 నివాస ప్లాట్లు కాగా 197 వాణిజ్య ప్లాట్లు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు నవులూరు, కురగల్లు, నిడమర్రు, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం రైతులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాయపూడి, వెంకటపాలెం, వెలగపూడి, మందడం, దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, ఉద్దండరాయనిపాలెం గ్రామ రైతులకు ఈ లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ, ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించవద్దాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, ఎం.శేషిరెడ్డి, జి.రవీందర్, ఏజీ చిన్ని కృష్ణ, పి.పద్మావతి, జి.రవీందర్, కె.స్వర్ణమేరీ, బి.సాయిశ్రీనివాస నాయక్, కె.ఎస్.భాగ్యరేఖ, సీఆర్‌డీఏ ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.



రాజధాని రైతుకు ఈ లాటరీ విధానంలో ప్లాటు కేటాయిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు



బందరుకోటను సందర్శిస్తున్న కలెక్టర్ బాలాజీ

పర్యాటక బాట.. బందరు కోట!

» పునరుద్ధరణ పనులు పరిశీలించిన కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం వారసత్వ సంపదగల చారిత్రాత్మక నగరమని, బందరుకోటను పర్యాటక సర్క్యూట్‌లో చేర్చేందుకు కోట పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం కలెక్టర్ బందరుకోట, నగరంలోని డచ్ సమాధులను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బందరుకోట పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు చెప్పినప్పటికీ ఇంకా పనులు జరగడం లేదన్నారు. ఢిల్లీలోని పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్‌కు నిధుల మంజూరు విషయమై మాట్లాడతామన్నారు. డచ్‌వారు ఈ



డచ్ సమాధులను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

కోటను వ్యాపారకేంద్రంగా, సైనికుల శిక్షణా కేంద్రంగా, ఆయుధాగారంగా చేశారన్నారు. 1864లో తుపానుకు కోట దెబ్బతిన్నదన్నారు. మంగినపూడి బీచ్, పాండురంగ స్వామి ఆలయాన్ని ఒక సర్క్యూట్‌గా చేస్తామన్నారు. అనంతరం డచ్ స్మశాన వాటికలను సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ ఉప పర్యవేక్షకుడు ఎన్.ఎస్. శివకుమార్, కన్సల్టెంట్ నాగేంద్ర కుమార్, రాష్ట్ర పురావస్తుశాఖ ఉపసంచాలకులు సురేష్, జిల్లా పర్యాటక అధికారి రామలక్ష్మణ్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అక్కసు!

(5వ పేజీ తరువాయి)

అవుతుందని సర్పంచ్ భర్త చెబుతున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కమీషన్ల కోసం జాప్యం

కమీషన్ల కోసమే పనులను చేపట్టకుండా జాప్యం చేస్తున్నారని స్థానిక గ్రామ టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. కమీషన్లు ఇచ్చిన వారికే పనులు అప్పగిస్తామని బహిరంగంగా చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. సర్పంచ్ వాదన మాత్రం మరోలా ఉంది. ఈ నిధులు 2021లో విడుదలైనప్పటికీ ఏ పనులు నిర్వహించాలో కేంద్ర ప్రభుత్వం సరైన మార్గదర్శకాలు విడుదల చేయక పోవడంతో ఆ నిధులుపై సందిగ్ధం నెలకొందని చెబుతున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం పనుల నిర్వహణ నిమిత్తం ఎలా ఖర్చు చేయాలో స్పష్టం చేసిందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ ఈ పనులను నామినేషన్ విధానంలో తమకు నచ్చిన వారికి కేటాయించేందుకు సిద్ధమవుతుండటంతో గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పనులు పారదర్శకంగా జరగాలంటే తక్షణం టెండర్లు పిలవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. టెండర్లు పిలిస్తే పనులు ఆలస్యం అవుతాయనుకుంటే పాలకవర్గాన్ని సమావేశపరచి కలిసికట్టుగా పనులు చేసుకునే విధంగానైనా నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇవేమీ పట్టకుండా.. పనులకు తీర్మానం చేయకుండా. ఎవ్వరికీ కట్టబెట్టకుండా ఉద్దేశ్యపూర్వక జాప్యం చేయటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. గ్రామస్థులు మాత్రం రాజకీయాలకతీతంగా ఎన్నికలలో గెలిచారని, గ్రామాభివృద్ధికి సహకరించాల్సిందిగా ఉభయులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ కస్తూరిబాయి రాజీనామా

(5వ పేజీ తరువాయి)

అప్పటి ఎమ్మెల్యేనే కారణమన్నారు. ఎవరెన్ని ఇబ్బందులకు గురిచేసినా పట్టణ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశానని తెలిపారు. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.20 కోట్లపైగా అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త వివాదం తెరపైకి వస్తుందా!

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామాతో వైసీపీ కౌన్సిలర్ల మధ్య నెలకొన్న వివాదం సర్దుమణుగుతుందా! లేక మరో కొత్త వివాదం తెరపైకి వస్తుందా అనే అనుమానం రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. నాటి ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాల తదుపరి చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్లు రాజీనామా చేసి కొత్తవారికి అవకాశం కల్పించాలని అప్పట్లో స్థానిక వైసీపీ పెద్దలు నిర్ణయించారు. గత కొంతకాలంగా చైర్‌పర్సన్ రాజీనామా డిమాండ్‌తో కొందరు వైసీపీ కౌన్సిలర్లు సమావేశాలకు గైర్హాజరవ్వడం, సమావేశాలకు హాజరైనా బోర్డుకు సహకరించక పోవడం వంటివి చేశారు. ఎట్టకేలకు చైర్‌పర్సన్ రాజీనామా చేయడంతో నాటి ఒప్పందం ప్రకారం వైస్‌చైర్మన్లను కూడా మార్చాలని వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

వాటాకోసం వచ్చి ప్రాణాలు తీసుకుంది!

(5వ పేజీ తరువాయి)

అడిగింది. దీనిపై తల్లి, కుమార్తె మధ్య వివాదం జరిగింది. దీంతో మౌనికపై రమాదేవి కొత్తపేట పోలీసులకు మార్చి 30న ఫిర్యాదు చేసింది. డబ్బుల కోసం తనను వేధిస్తోందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు స్టేషన్‌కు రావాలని మౌనికకు ఫోన్ చేశారు.

భార్య ఆత్మహత్యకు అత్తే కారణం.. పోలీసులకు అల్లుడి ఫిర్యాదు

బుధవారం రాత్రి రమాదేవి ఇంటికి ఆమెతో సహజీవనం చేస్తున్న వెంకటేశ్వరరావు వచ్చాడు. ఆ ఇద్దరినీ ప్రత్యక్షంగా చూసిన మౌనిక కోపాన్ని ఆపుకోలేకపోయింది. వెంకటేశ్వరరావును పరుష పదజాలంతో దూషించింది. అప్పటికే బీమా సొమ్ములో వాటా అడగడంతో మౌనికపై రమాదేవి ఆక్రోశంతో ఉంది. తన ఎదుటే వెంకటేశ్వరరావును దూషించడంతో తట్టుకోలేక కుమార్తెపై ఎదురుతిరిగింది. రమాదేవి, వెంకటేశ్వరరావులు కలిసి మౌనికను తీవ్రంగా దూషించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె తన అక్క విజయలక్ష్మి, భర్త కృష్ణశంకర్‌కు ఫోన్‌చేసి తల్లి, వెంకటేశ్వరరావు అన్న మాటలు చాలా బాధించాయని ఆవేదన వ్యక్తం చేసింది. తాను చనిపోతున్నానని, తన ఇద్దరి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేసింది. ఆ తర్వాత తల్లి ఇంటి నుంచి బయటకు వచ్చి పురుగుల మందు తాగింది. అప్పటికే అక్క విజయలక్ష్మి మరో బంధువుతో కలిసి తల్లి ఇంటికి బయలుదేరింది. ఆ ఇంటికి సమీపంలో మౌనిక పడిపోయి కనిపించింది. వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న మౌనిక భర్త కృష్ణశంకర్ విజయవాడకు చేరుకున్నారు. అత్త రమాదేవి వేధింపుల కారణంగానే మౌనిక ఆత్మహత్య చేసుకుందని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జవసత్వాలు!

(5వ పేజీ తరువాయి)

వానపాములను వేస్తారు. ఇలా వేసిన కుళ్లిన చెత్తపై 65 రోజుల పాటు పేడకలిపిన నీటితో తడుపుతూ ఉంటారు. దీనిని వానపాములు కలియబెడతాయి. అనంతరం వర్మీ కంపోస్టును జల్లెడపట్టి వానపాములను వేరు చేస్తారు. వేరు చేసిన వర్మీకంపోస్టును కేజీ రూ.10 చొప్పున రైతులకు, మొక్కల పెంపకం దారులకు విక్రయిస్తారు.

పారిశుధ్య సమస్యలకు చెక్

-జె.అరుణ, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటుతో పారిశుధ్య సమస్యలకు కొంత మేర బ్రేక్ పడుతోంది. గతంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపించేవి. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తుండంతో చెత్తకుప్పలు కనుమరుగయ్యాయి. జిల్లాలో 50కిపైగా కేంద్రాల్లో చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేస్తున్నారు. మిగిలిన పంచాయతీల్లో ఈప్రక్రియను ప్రారంభిస్తాం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	145, 154, 165
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

లోతట్టు ప్రాంతాలు జలమయం

గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల వరకు వర్షం పడుతూనే ఉంది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుద్ధవరం బస్టాప్, యాదవుల రామాలయం, దుర్గాపురం జాతీయ రహదారిపై నీళ్లు నిలిచాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో అంతర్గత మట్టి రోడ్లు బురద కయ్యలుగా మారాయి.


గన్నవరం జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు


మానికొండలో కలుషిత నీటి సరఫరాపై స్థానికులను ఆరా తీస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కలుషిత నీటి సరఫరాపై తనిఖీ

ఉంగుటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మానికొండ గ్రామంలో కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న పంచాయతీ నీటిని గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్ నేతృత్వంలోని అధికారుల బృందం పరిశీలించింది. పంచాయతీ పంపులద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని ఇటీవల పర్యటనకు వచ్చిన అధికారులకు స్థానికులు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన నేపథ్యంలో అప్రమత్తమైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల బృందం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలోని రక్షిత తాగునీటిపథకం ఓవర్ హెడ్‌ట్యాంకులు, బోర్‌వెల్స్, పైప్‌లైన్లను ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వి.సూర్యప్రకాష్‌నాథ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్చి 29న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసినట్లు గమనించారు. స్థానికులను ఆరా తీశారు. అనంతరం ఫిర్యాదుదారు షేక్ ఉమర్‌తో మాట్లాడి ఆయన సమక్షంలో కుళాయి నీటిని బక్కెట్‌లో నింపి పరీక్షించారు. సేకరించిన అంశాలపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఈఈ నటరాజ్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుధాకర్, ఏఈ స్రవంతి, పంచాయతీ కార్యదర్శి వీఎస్ ప్రకాష్‌నాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మణికంఠ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్-3 జోన్‌కు నీటి విడుదలను పెంచాలి

ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు


సాగునీటి విడుదలను పరిశీలిస్తున్న కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్‌లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఆయకట్టులోని 3వజోన్‌కు నీటి విడుదలను 2వేల క్యూసెక్కులకు పెంచేలా చర్యలు తీసుకోవాలని నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు కోరారు. మద్దులపర్వ వద్ద గల రెగ్యులేటర్ ద్వారా సాగర్ జలాల విడుదలను, నూజివీడు బ్రాంచ్ కెనాల్ విడుదలవుతున్న సాగునీటిని గురువారం డీసీ చైర్మన్లు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రంగన్నగూడెంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం ఈరోజు విడుదల చేసిన 1635క్యూసెక్కుల నీరు 117వ కిమీ వద్ద 1190 క్యూసెక్కులు మాత్రమే అందుబాటులోకి వచ్చిందన్నారు. మైలవరం బ్రాంచ్ కెనాల్ పరిధిలోని మూలపాడు, ఇబ్రహీంపట్నం, చెవుటూరు మేజర్ల పరిధిలో సాగునీటి ఇబ్బంది నెలకొందన్నారు. మానవతా దృక్పథంతో ఇప్పుడు ఇస్తున్న 1635 క్యూసెక్కుల నీటి విడుదలను 2వేల క్యూసెక్కులకు పెంచి ఈ నెల 15 వరకూ సాగునీటి విడుదలను కొనసాగించాలని వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీ చైర్మన్ కొల్లి శ్రీనివాసరెడ్డి(రెడ్డిగూడెం), పామర్తి శ్రీనివాసరావు (నున్న), ఏలూరు జిల్లా డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ(ముసునూరు), కృష్ణాజిల్లా డీసీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ(మడిచర్ల), ఎస్సీ ఏఈఈ లోకేశ్వరి, జయరాజు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధికూలీలకు పెండింగ్‌లో వున్న వేతనాలు అందించాలని, పనిచేసే ప్రదేశాల్లో తాగునీరు, సేదతీరటానికి టెంట్లు, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో వుంచేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయకార్మికసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయనకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గతంలో మాదిరి పే స్లిప్పులు పంపిణీచేయాలని, పలుగు, పార వంటి పనిముట్లు కూడా కూలీలకు అందజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రావు, సంఘనాయకులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.


డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయకార్మికసంఘం నేతలు


రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

అభివృద్ధి, సంక్షేమం దిశగా నియోజకవర్గం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం దిశగా నియోజకవర్గం పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులోని డ్యూటీ పాక వద్ద రూ 19 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఈవో శివ ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, జనసేన పార్టీ నాయకులు పులి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

ఉయ్యూరు : సెల్‌ఫోన్‌లు, సైబర్ నేరాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టిసారించి లక్ష్యాన్ని చేరుకోవాలని గృహనిర్మాణశాఖ మంత్రి కె.పార్థ సారథి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా అన్నారు. ఎంకె ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 2కె25 ఉత్సవ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యతోపాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు కార్యక్రమానికి హాజరై విద్యార్థులు, స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబును అభినందించారు.



వాలెత్ సదాశివన్ గిరీష్‌కు జ్ఞాపికను అందిస్తున్న కళాశాల యాజమాన్యం

స్టార్టప్‌లను పెంచాలి

వీఆర్ సిద్ధార్థ వీసీ వెంకటేశ్వరరావు

పెనమలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వయం ఆధారితంగా ఉండాలని, మరిన్ని ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని, స్టార్టప్‌లను పెంచాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు వీఆర్ సిద్ధార్థ వీసీ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల డ్రోన్ ఫ్యూజన్ ఈవెంట్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక ఆలోచనను నిర్మించడానికి, ఆ ఆలోచనకు అవసరమైన భాగాలు పొందడానికి సంస్థ ఒక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ప్రొవీసీ ఏవీ రత్నప్రసాద్, ఈఈఈ విభాగ అధిపతి పీవీఆర్ఎల్ నరసింహం మాట్లాడుతూ వ్యవసాయ పర్యవేక్షణ, విత్తనాలు నాటడం, ఆరోగ్య సంరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కార్యకలాపాలు వంటి ప్రధానరంగాలపై డ్రోన్ రంగం దృష్టి సారించిందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథి వాలెత్ సదాశివన్ గిరీష్ మాట్లాడుతూ ప్రస్తుత తరం కంటే తదుపరి తరం ఉత్పత్తులు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు.

కాల్వల్లో నాన్‌నోటిఫైడ్ తూములను తొలగించండి

డీఈ బాబు కొడాలి, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డికి రైతుల వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కానుమోలు, కాకులపాడు సాగునీటి చానళ్ల(కాలువలు)పరిధిలో అనుమతులు లేకుండా తూములను ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పరుస్తున్నారని వాటిని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రైతులు డీఈ బాబు కొడాలి, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్‌లకు వినతి పత్రం అందజేశారు. సాగునీటి కాల్వల పూడిక తొలగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం పెరికీడు వచ్చిన ఆయనను రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనధికారికంగా తూములు ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కానుమోలు నీటి సంఘ అధ్యక్షుడు శివకుమార్, కాకులపాడు నీటి సంఘ అధ్యక్షుడు గోపాలకృష్ణ, మున్నంగి బాబూ రావు, చలసాని శ్రీనివాస్, జాస్తి భూపతిరావు, లింగం శ్రీధర్, అట్లూరి సత్తిబాబు, బీరయ్య పాల్గొన్నారు.

పూడిక తొలగింపు పనులు ప్రారంభం

వేలాది ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు తాగునీటిని అందించే ఏలూరు కాలువ పూడిక తొలగింపు పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. గుర్రపుడెక్క, చెత్తతో నిండిన కాలువను యుద్ధ ప్రాతిపదికన ట్రాక్టర్లతో పూడిక తొలగించే పనులను జలవనరులశాఖ డీఈ బాబు కొడాలి, ఏఈ తనూజలో పర్యవేక్షించారు. 10రోజుల్లో తాగునీటి కోసం కాలువలో నీటిని వదిలేందుకు కాలువలో చెత్తను తొలగించి సన్నద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణానికి క్షేత్రస్థాయి పరిశీలన


సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి-ఆగిరిపల్లి రహదారిలో వీరవల్లి వద్ద గల రైల్వే లైన్‌పై ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం జరిగిందని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం అన్నారు. వీరవల్లి రైల్వే గేటు వద్ద బాపులపాడు మండల తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. నిర్మాణానికి అవసరమైన భూములను, ఆర్వోబీ నిర్మాణంలో కోల్పోయే భూవివరాలతోపాటు ప్రజల వివరాలను రైల్వేశాఖకు నివేదిక అందజేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా రైల్వేశాఖ తుది ప్రణాళికను త్వరలోనే తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఫణికుమార్, వీఆర్వో సునీల్ కుమార్, ఉపసర్పంచ్ లంక అజయ్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

రాష్ట్రాభివృద్ధి ద్వారా యువతకు బంగారు భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహనబెనర్జీ అన్నారు. వీరవల్లిలో గురువారం ఆయన జన్మదినోత్సవ కార్యక్రమంలో భాగంగా తెలుగుయువతతో కలిసి కేక్ కట్ చేశారు. ఉపసర్పంచ్ అజయ్, ఆనంద్, రామకృష్ణ, రాయి సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఓసీ, బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నేడు

గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఓసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న గన్నవరం, కేసరపల్లి, సూరంపల్లికి చెందిన బీసీ, ఓసీ లబ్ధిదారులు ఆన్‌లైన్ సర్టిఫికెట్‌తోపాటు కుల, ఆదాయ, ఆధార్ జిరాక్స్, ఒరిజనల్స్‌తో హాజరు కావాలన్నారు. ఉదయం 9.30నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

పెనమలూరు: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు శుక్రవారం నుంచి పెనమలూరులోని ఎంపీడీఓవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో బండి ప్రణవి తెలిపారు. ఉదయం 11గంటలకు దరఖాస్తు చేసుకొన్న అప్లికేషన్, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం ఒరిజినల్, నకళ్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కేవలం పెనమలూరు, పెదపులిపాక, చోడవరం, వణుకూరు, గంగూరు, గోసాల గ్రామాలకు చెందిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని కోరారు.

మానవీయ విలువల పెంపే సహజయోగ లక్ష్యం

గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మానవీయ విలువలు పెంపే లక్ష్యంగా సహజయోగ ప్రచార రథయాత్ర పర్యటనలు ప్రారంభిస్తున్నట్లు సహజయోగ ధ్యాన కేంద్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ రామ్మోహనరావు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌హెచ్ శ్రీ మాతాజీ నిర్మలదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10 వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో సహజయోగ చైతన్య ప్రచారరథం పర్యటించనుందన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమై జగ్గయ్యపేట మీదుగా ఎన్టీఆర్ జిల్లాలో ప్రవేశించి మధ్యాహ్నం 12గంటలకు గొల్లపూడి చేరుతుందన్నారు. అక్కడ నుంచి ఉమ్మడి జిల్లాలో పర్యటన కొనసాగుతుందన్నారు. పి.గజేంద్రరావు, ఎస్ శంకర్, ఎం.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

నవమి వేడుకకు చురుగ్గా ఏర్పాట్లు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 6న నిర్వహించనున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అభయాంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న రామ మందిరాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. అభయాంజనేయ స్వామి ఆలయం వెనుక భాగంలో కల్యాణం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు. ఆనవాయితీ ప్రకారం భద్రాచలం ఆలయం నుంచి స్వామి తలంబ్రాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.516లు రుసుము చెల్లించి ఆలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

అదనపు విద్యుత్ చార్జీలు తగ్గించాలి : ఐద్వా

కంకిపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పెంచిన కరెంటు చార్జీలను తక్షణం తగ్గించాలని ఐద్వా నాయకురాలు ఈ కనకదుర్గ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన చార్జీలు తగ్గించాలని కోరుతూ గురువారం కంకిపాడులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు విద్యుత్ చార్జీలు పెంచమంటూ ప్రచారం చేసిన నాయకులు అధికారంలోకి రాగానే విద్యుత్ భారం పెంచటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, పి.లక్ష్మీ, వి.అనసూర్యావతి తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేశ్వరరావు

దయాల రాజేశ్వరరావు బాధ్యతల స్వీకారం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ డైరెక్టర్‌గా టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం అమరావతిలో సంస్థ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో రాజేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. రాజేశ్వరరావు ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించి అభిమానులతో అమరావతి వెళ్లారు.ప్రమాణ స్వీకారం అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాజేశ్వరరావు వెంట మండల నాయకులు గండేపూడి నితీష్‌కుమార్, దయాల రాజీవ్‌కాంత్, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

సాయిబాబా ఆలయానికి వాటర్‌కూలర్ బహూకరణ

పెనమలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది, టీడీపీ సీనియర్ నాయకులు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ కుమార్తె డాక్టర్ చదలవాడ ఖ్యాతిశ్రీ జన్మదినం సందర్భంగా కానూరు కేసీపీ కాలనీలోని సాయిబాబా ఆలయానికి వాటర్‌కూలర్ బహుకరించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో అల్లుడు చదలవాడ ప్రణీత్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, వీఆర్ సిద్ధార్థ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్‌కుమార్, కామినేని బుచ్చిబాబు, కొంగర సాయి తదితరులు పాల్గొన్నారు.


రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని టీడీపీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. స్థానిక సచివాలయం-4 పరిధిలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ ఇతర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రికి అభివృద్ధి కమిటీ సభ్యులు దేవినేని సులోచన రాణి, బుస్సే నాగప్రసాద్, డాక్టర్ శారమ్మ, నరేష్‌కుమార్, మోజెష్, హఫీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కట్టడం తొలగింపు



పెనమలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలోని కానూరులో అనధికారికంగా అనుమతులు లేకుండా కట్టిన నిర్మాణాన్ని అధికారులు గురువారం తొలగించారు. మునిసిపాలిటీలో అనధికారిక కట్టడాల విషయంలో కఠిన చర్యలు తీసుకొంటామని కమిషనర్ భవానీ ప్రసాద్ హెచ్చరించారు.

బాపులపాడు హైస్కూల్‌కు విద్యుత్ బిల్లు రూ1.18లక్షల మాఫీ

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వమే బిల్లులు చెల్లించి ఉపశమనం కలిగించింది. అందులో భాగంగా బాపులపాడు జడ్పీ హైస్కూల్‌కు గతేడాది నవంబరు వరకు ఉన్న విద్యుత్ బిల్లు బకాయిలు రూ1.18లక్షలు ప్రభుత్వమే గత నెలలో చెల్లించి భారాన్ని తగ్గించిందని ఆ పాఠశాల హెచ్ఎం టీవీ.నాగేశ్వరరావు తెలిపారు.


కాటూరు రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

చెత్త సేకరణ అంతంత మాత్రమే..

ఉయ్యూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట పంచాయతీ పరిధిలో ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాటూరు రోడ్డుతో పాటు గ్రామంలో పలు చోట్ల చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త తొలగింపునకు సరిపడా పారిశుధ్య సిబ్బందిని నియమించక పోవడంతో ఇంటింటికి తిరిగి త డి పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం సాధ్యపడడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనందపురంలో స్థానికులు సర్వీసు రోడ్డు వెంబడి చెత్త పోయడంవల్ల హైవేపై వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు.

అటకెక్కిన గిడ్డంగి పనులు

రైతుల పాలిట శాపంగా మారిన వైసీపీ ప్రభుత్వ విధానాలు

- ఏఎంసీలో కోల్డ్ స్టోరేజ్ పనులు అర్థాంతరంగా నిలిపివేత
- పిచ్చిచెట్లతో నిండిపోయిన బేస్‌మెంట్, శిలాఫలకం

జగ్గయ్యపేట ఏఎంసీలో 2016లో అప్పటి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎమ్మెల్సీగా ఉన్న తొండెపు దశరథ జనార్ధన్ కృషితో రూ.4కోట్ల నాబార్డు ఆర్‌డీఎఫ్ నిధులతో శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్)కి శంకుస్థాపన చేశారు. అదేరోజు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. శంకుస్థాపన అనంతరం నిధులు విడుదల, టెండర్ల ప్రక్రియ ముగించి 2018లో పనులు ప్రా రంభించారు. భవనం బేస్‌మెంట్‌స్థాయి దాటి పిల్లర్లు వేసే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ రావటంతో పనులు నిలిపేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కోల్డ్ స్టోరేజీ పనులు అటకెక్కాయి. బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన పనులు అలాగే ఉండిపోయాయి. దీంతో పిచ్చిచెట్లు పెరిగి అరణ్య వాతావరణం నెలకొంది. కొంతమేర లేచిన పిల్లర్లు, ఇనుప చువ్వలు పాడైపోయాయి. టీడీపీ ప్రభుత్వం వేసిన శిలాఫలకం చుట్టూ ముళ్ల కంపలు పెరిగిపోయాయి. ఇప్పుడు టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. తాజాగా పేట సమీపంలో ప్రైవేట్ కోల్డ్‌స్టోరేజీలో అగ్ని ప్రమాదం జరగడంతో ఆగిపోయిన కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం అంశం వెలుగులో కొచ్చింది. ఆ కోల్డ్‌స్టోరేజీని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ కోల్డ్‌స్టోరేజీ ఉండి ఉంటే తమకీ బాధలు ఉండేవి కావని వాపోతున్నారు. బూదవాడకు చెందిన రైతు నేత గడ్డం హూస్సేన్, పోలంపల్లికి చెందిన రైతు నేత ఆవుల రామారావు మాట్లాడుతూ ఏఎంసీలో కోల్డ్‌స్టోరేజి నిర్మాణాన్ని పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే తాతయ్యను, ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కట్టా నరసింహారావు మాట్లాడుతూ తాను ఏఎంసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు బేస్‌మెంట్ వరకు పనులు పూర్తిచేశామని, ప్రభుత్వం మారటంతో ఆగిపోయిందన్నారు. ఏఎంసీ సెక్రటరీ ఎన్వీ నరసింహారావు మాట్లాడుతూ కొత్త పాలకవర్గం వచ్చాక కోల్డ్ స్టోరేజీపై ఏం చేయాలో నిర్ణయం తీసుకోవాలని, ఎమ్మెల్యే తాతయ్య దృష్టికి ఈ కోల్డ్‌స్టోరేజీ అంశాన్ని తీసుకెళ్తామన్నారు.


పిచ్చి చెట్లతో నిండిన ఏఎంసీలో కోల్డ్ స్టోరేజి బేస్‌మెంట్ ప్రాంతం, శిలాఫలకం


పనులు ప్రారంభించాలని కోరుతున్న గడ్డం, కట్టా ఆవుల

వైసీపీ ప్రభుత్వ విధానాలే జగ్గయ్యపేట రైతుల పాలిట శాపంగా పరిణమించింది. జగన్ అసంబద్ధ నిర్ణయాలతో ఏఎంసీలో నిర్మించ తలపెట్టిన కోల్డ్ స్టోరేజ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. అదే ప్రభుత్వ కోల్డ్ స్టోరేజ్ అందుబాటులో ఉంటే రైతులకు ఎంతో అసరాగా ఉండేది. ప్రైవేట్ కోల్డ్ స్టోరేజ్‌ల నిర్లక్ష్యంతో రోడ్డున పడే దుస్థితి లేకుండా పోయేది.
- ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట

తాజాగా కొసమెరుపు ఏమిటంటే 2019లో అర్ధాంతరంగా వైసీ పీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజి పనులను ఆపేసిన తాలుకా పనులకు రూ.35లక్ష లు బిల్లులను ఇటీవల టీడీపీ ప్రభుత్వం విడుదల చేసింది. చిన్న కాంట్రాక్టర్లకు ఉపశమనం కలిగిస్తూ తీసుకున్న నిర్ణయంలో కోల్డ్ స్టోరేజీ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు వచ్చాయి.


పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కలెక్టర్ బాలాజీ

అనాథలను అక్కున చేర్చుకున్నారు..!

మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు వారిని చదివించి ప్రయోజకులను చేయాలని కలెక్టర్ బాలాజీ అన్నారు ప్రభుత్వ శిశుగృహాల్లో ఉంటున్న ముగ్గురు పిల్లలను కలెక్టర్ చాంబరులో కలెక్టర్ సమక్షంలో గురువారం దత్తతకు ఇచ్చారు. సెంట్రల్ అడాప్టర్ రీసోర్స్ అథారిటీ (కారా)ద్వారా పిల్లలను దత్తత ఇస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మచిలీపట్నం శిశుగృహంలోని హిమాన్షు అనే 7 నెలల బాలుడిని చిత్తూరు జిల్లాకు చెందిన పీఎస్ ప్రసాద్, సుజాత దంపతులకు దత్తత ఇచ్చారు. బుద్ధవరం శిశుగృహాలోని రెండున్నరేళ్ల పాపను హైదరాబాద్‌కు చెందిన వికాస్‌పంక్వనీ, మనీషా దంపతులకు దత్తత ఇచ్చారు. నాలుగేళ్ల వయసున్న సుశాంత్ అనే బాలుడిని బెంగుళూరుకు చెందిన కృష్ణ, నందిని దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్‌రాణి పాల్గొన్నారు.


బందరు కాలువ కట్టపై మట్టితవ్వి చదును చేసి, ఇంటి వద్ద పోస్తున్న రైతు

బందరు కాలువ కట్టను తవ్వేశారు

- పంటల సాగు కోసం రైతు దుశ్చర్య

తోట్లవల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బందరు కాలువకు రక్షణగా ఉండాల్సిన కట్టను కోటేశ్వరరావు అనే రైతు ఎక్సకవేటర్‌తో గురువారం మట్టిని తవ్వి ఇంటికి తరలించాడు. మట్టిని తవ్వి ట్రాక్టర్‌పై తరలిస్తుండటంతో గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కంకిపాడు ఇరిగేషన్ సిబ్బంది వచ్చి కట్ట తవ్వకాన్ని నిలిపేశారు. కట్టను తవ్వి చదునుగా చేసి పొలం గట్టంత కట్టను మాత్రమే మిగిల్చారు. రేపు కాలువకు నీరువస్తే ఈ చిన్నగట్టు తెగి నీరు కట్టపైగా ప్రవహించే ప్రమాదం ఏర్పడింది. ఇందిరాగాంధీ హయాంలో కాలువ కట్టను ఇచ్చారని, దిబ్బ ఉంటే తొలగించి చదును చేశానని, పంటలు సాగుచేస్తానని కోటేశ్వరరావు చెప్పారు. కాలువ కట్టను ఎక్సకవేటర్‌తో తవ్వి మట్టిని బయటకు తరలించటం నేరమని ఇరిగేషన్ సిబ్బంది హెచ్చరించారు. ఇంటివద్ద పోసిన మట్టిని మళ్లీ తీసుకువచ్చి కట్టపై పోయిస్తామని ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు.


ప్లస్ టూ పూర్తి చేసిన విద్యార్థినికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘనంగా స్నాతకోత్సవం

గుణదల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యలను ఎదుర్కొని అధిగమించే ధైర్యాన్ని యువత పెంపొందించుకోవాలని విట్ ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనర్జీ చెక్క అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని ఢిల్లీపబ్లిక్ స్కూల్లో స్నాతకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాలానుగుణంగా మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం బాలబాలికలు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్లస్ టూ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ చేతులమీదుగా అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, పరిమి సునంద, కడియాల ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ భువనేశ్వర్, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ భాటియా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కనే జేసీ గీతాంజలిశర్మ

ఇసుక కొరత లేకుండా చర్యలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో జిల్లాకు ఇసుక కొరతలేకుండా చూడాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం గురువారం జేసీ గీతాంజలిశర్మతో కలిసి నిర్వహించారు. జిల్లాలో ఇసుకపాలసీ విధానం అమలుచేస్తున్న తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెమీ మెకనైజ్డ్ విధానంలో ఇసుక రేవుల్లో యంత్రాల ద్వారా ఇసుకను తవ్వేందుకు అనుమతులు వచ్చాయన్నారు. పమిడిముక్కల మండలం పటమటలంక, పెనమలూరు మండలం చోడవరం, తోట్లవల్లూరు మండలంలోని నార్త్‌వల్లూరు, రొయ్యూరు క్వారీలను నూతనంగా ఎంపిక చేశామన్నారు. వీటిలో ఇసుక తవ్వకాలకు త్వరలో టెండర్లు పిలిచి ఇసుక తవ్వకాలు ప్రారంభించాలన్నారు. యంత్రాలతో ఇసుక లోడ్‌చేస్తే ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. వచ్చే వర్షాకాలంలోనూ ఇసుక కొరతలేకుండా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ సత్యనారాయణ, గనులశాఖ ఏడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో రెండు వర్గాల ఘర్షణ

చిట్టినగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఉన్న సీఎస్ఐ చర్చిలో రెండు వర్గాలు పదవుల కోసం కొట్లాడుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. కొత్తూరు తాడేపల్లిలో సీఐఎస్ చర్చి కమిటీ పదవీ కాలం జనవరితో ముగిసింది. కొత్త కమిటీని ఎన్నుకునేందుకు కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రత్యర్థి వర్గం డిమాండ్ చేస్తోంది. గురువారం రాత్రి చర్చి కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరగడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో రెండు వర్గాలకు చెందిన నలుగురు గాయపడ్డారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన వన్‌స్టాప్ సెంటర్ కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బొండా ఉమా, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, తదితరులు

మహిళల భద్రత, రక్షణే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

వన్‌టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల భద్రత, రక్షణకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ కొత్త భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో 11 నుంచి 13 మంది వరకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించే భవనాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు మహిళల రక్షణకు ప్రాముఖ్యతను ఇస్తున్నారన్నారు. మోసగించబడిన మహిళలకు న్యాయపరంగా, కుటుంబపరంగా సహాయ సహకారాలు అందించేలా వన్‌స్టాప్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఒక మహిళగా ఇంటిలో చెప్పుకోలేని విషయాలు ఇక్కడున్న మహిళా అధికారులకు చెప్పుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా మహిళలకు రక్షణతో పాటు వారికందాల్సిన న్యాయం, ఆసుపత్రి సౌకర్యాలు కల్పించి బాధిత మహిళకు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వారు భద్రంగా ఉన్నామని అనుకున్నప్పుడు మాత్రమే తిరిగి పంపిస్తామన్నారు. గుంటూరులో శక్తిసదన్ మహిళా వసతి గృహాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 5,600 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల్లో 960 మంది సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, దాడులు ఏం జరిగినా వారి పూర్తి రక్షణకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రభుత్వ పరంగా వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇక్కడ మహిళా పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ వైద్యపరంగా, న్యాయపరంగా రక్షణ కల్పిస్తూ సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ సూర్యకుమారి, డైరెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దాసరి శ్రీలక్ష్మి, డీసీపీ (అడ్మిన్) సరిత పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు ప్రకృతి వ్యవసాయమే మార్గం

- వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేరళ మంత్రి ప్రసాద్

జి.కొండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించి మంచి దిగుబడులు సాధించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులే సరైన మార్గమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం కేరళ వ్యవసాయశాఖ మంత్రి పి.ప్రసాద్ తన బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్రమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పెద్ద ప్రభావం పడుతోందని, మట్టిలో జీవనశక్తి తగ్గిపోవడం, నీటి కొరత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అధికంగా కార్బన్ ఉద్గారాలు వంటి సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారమన్నారు. తొలుత విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్లో కేరళ బృందంతో విజయకుమార్ సమావేశమై 9 ఏళ్లుగా ఏపీసీఎన్‌ఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సభ్యులడిగిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. చెవుటూరు గోశాలలో ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాల చక్రాన్ని ప్రదర్శిస్తూ ప్రకృతి వ్యవసాయం వెనుకున్న శాస్త్రీయ దృక్పథాన్ని వివరించారు. మహిళా రైతు రమాదేవి మామిడి తోటను సందర్శించి అనేక విషయాలను కేరళ బృందం తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, కేరళ వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ వెంకట రామన్, అదనపు వ్యవసాయ డైరెక్టర్ థామస్ సామ్యూల్, ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా పీడీ విజయకుమారి పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కేరళ మంత్రి, బృందం


ప్రధాన వేదిక వద్ద పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు, ఎమ్మెల్యే సౌమ్య, టీడీపీ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం

సీఎం సభకు శరవేగంగా ఏర్పాట్లు

- పరిశీలించిన కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

చందర్లపాడు, ఏప్రిల్ 3: (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 5న జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని సీఎం ముప్పాళ్ల వస్తున్న విషయం విధితమే. పర్యటనలో భాగంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు, ప్రజాదర్బార్, పీ4, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం పాలెం రోడ్డులోని ఒక ప్రైవేటు భూమిలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ముప్పాళ్ల గ్రామం వద్ద పదెకరాల వ్యవసాయ భూమిలో పీ4, ప్రజాదర్బార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సీపీ సీ రాజశేఖరబాబు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రధాన వేదిక స్థలంతో పాటు స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించారు. సీఎం చంద్రబాబు పాఠశాలను సందర్శించే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆర్‌డీవో కే బాలకృష్ణ, డీసీపీ మహేశ్వరరాజు, ఏసీపీ తిలక్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మంగినపూడి బీచ్

- బీచ్‌ను సందర్శించిన మంత్రి రవీంద్ర, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం రాత్రి మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగినపూడి బీచ్ ఏపీ రాజధాని అమరావతి, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్, భీమవరం, రేపల్లెకు దగ్గరగా ఉన్న సురక్షిత బీచ్ అని అన్నారు. దీని అభివృద్ధికి 200 ఎకరాలు అవసరమని, ఇప్పటికే 150 ఎకరాలను గుర్తించామన్నారు. మరో 50 ఎకరాలు గుర్తిస్తామన్నారు. బీచ్‌లో పీ4 కింద రిసార్ట్స్, హోటళ్లు నిర్మించేందుకు భూములు కేటాయిస్తామన్నారు. స్వదేశీ దర్శన్ కింద కేంద్రం నుంచి రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. మే 15 నుంచి 3 రోజుల పాటు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. 2018లో 3 రోజుల పాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహించామని, 10 లక్షల మంది పాల్గొన్నారన్నారు. అదే విధంగా వచ్చే మే 15 నుంచి బీచ్ ఫెస్టివల్‌తో పాటు జాతీయ బీచ్ కబడ్డీ, కియా కింగ్, జలక్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ మాట్లాడుతూ మంగినపూడి బీచ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్వదేశీదర్శన్ పథకం కింద పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో 972 కిలోమీటర్ల సముద్ర తీరం ఉందన్నారు. 9 బీచ్‌లను గుర్తించామని, అందులో సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రం రూ.100కోట్లు మంజూరు చేసిందన్నారు. 2వ బీచ్‌గా మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వాటర్ స్పోర్ట్స్ ఫెసిలిటీ, షాపింగ్, మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. హోటళ్లు, రిసార్ట్‌లు అభివృద్ధి చేయవచ్చన్నారు. సీఎం చంద్రబాబు పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకురాలు వైవీ ప్రసన్నలక్ష్మి, చీఫ్ కన్సల్టెంట్ కె.లక్ష్మీనారాయణ, ఆర్కిటెక్ మధు, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణరావు, కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ నాగభూషణం టీడీపీ నేతలు కుంచే నాని, జిల్లా పర్యాటక శాఖాధికారి రామలక్ష్మణ్ పాల్గొన్నారు.


మంగినపూడి బీచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, అజయ్‌జైన్, కలెక్టర్ బాలాజీ

ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ యాత్ర

- వేసవి టూర్ ప్యాకేజీల విడుదల
- 8 నుంచి యాత్ర ప్రారంభం

ఆంధ్రజ్యోతి, రైల్వేస్టేషన్: వేసవిలో సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర పేరుతో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సరికొత్త టూర్ ప్యాకేజీలను విడుదల చేసింది. భారత్ గౌరవ్ ట్రైన్‌లో విజయవాడ మీదుగా ఐఆర్‌సీటీసీ ఈ ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రకటించింది. ఈనెల 8న యాత్ర ప్రారంభమై 19వ తేదీ వరకు కొనసాగుతుంది. ఉజ్జయిని (మహాబలేశ్వర్ ఓంకారేశ్వర్), ద్వారకా (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమాశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (ఘృష్ణేశ్వర్) యాత్ర ఉంటుంది. ఈ ప్యాకేజీలో ఒక్కో వ్యక్తి రూ.18,510 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీ 2లో 23న ప్రారంభమై మే 2 వరకు కొనసాగుతుంది. హరిద్వార్ - రుషికేష్ - వైష్ణోదేవి యాత్రగా ఈ ప్యాకేజీ ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ.18,510లు చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీ 3 మే 8న ప్రారంభమై మే 17 వరకు కొనసాగుతుంది. కాశీ, గయ, ప్రయాగ్, అయోధ్య యాత్ర (సరస్వతీ పుష్కరాలు ప్రత్యేకం) పూరి, కోణార్క్, గయ, వారణాశి, అయోధ్య, ప్రయాగరాజ్‌లో సాగుతుంది. ఈ టూర్‌కు ఒక్కో వ్యక్తి రూ.16,800లు చెల్సించాల్సి ఉంటుంది. ప్యాకేజీ 4 మే 22 నుంచి ప్రారంభమై మే 30న ముగుస్తుంది. అరుణాచలం, మధురై, రామేశ్వరం యాత్ర ప్యాకేజీగా నిర్ణయించారు. ఈ యాత్రకు ఒక్కొక్కరికి రూ.14,700 చెల్లించాలి. ప్యాకేజీ 5లో పంచ జ్యోతిర్లింగ యాత్ర జూన్ 4న ప్రారంభమై 12న ముగుస్తుంది. మహాబలేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమాశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మహూవ, నాగపూర్ మీదుగా సాగుతుంది. ఒక్కొక్కరికి రూ.14,700 చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 9281495848, 9281030714 నంబర్లకు ఫోన్ చేయొచ్చు లేదా ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు డబ్ల్యూడబ్ల్యూ ఐఆర్‌సీటీసీటూరిజం.కామ్‌లో చూడవచ్చు.



టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

కృష్ణాజిల్లాలో 1,91,627, ఎన్టీఆర్ జిల్లాలో 1,72,019 జవాబు పత్రాల మూల్యాంకనం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. గురువారం మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారం పాటు నిర్వహిస్తున్న ఈ శిబిరానికి క్యాంపు ఆఫీసరుగా డీఈవో రామారావు వ్యవహరిస్తున్నారు. స్ట్రాంగ్ రూం డిప్యూటీ క్యాంపు ఆఫీసరుగా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లుగా ఉయ్యూరు డీవైఈవో పద్మజారాణి, బందరు డీవైఈవో శేఖర్ సింగ్‌ను నియమించారు. 16 రూంలు, రెండు హాళ్లల్లో జరుగుతున్న ఈ వాల్యుయేషన్‌కు సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. 1,91,627 జవాబు పత్రాలను వారం రోజుల పాటు మూల్యాంకనం చేయనున్నారు.

విజయవాడలోనూ..

విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభమైంది. విజయవాడలోని బిషప్ అజరయ్య హైస్కూల్లో గురువారం నుంచి స్పాట్ వాల్యుయేషన్ మొదలైంది. అన్ని పరీక్షలకు కలిపి లక్షా 72 వేల 19 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు ఏడుగురు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, 92 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 552 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 184 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. మొత్తం 92 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ మూల్యాంకన ప్రక్రియను డీఈవో సుబ్బారావు పరిశీలించారు.


మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డీఈవోలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	145, 154, 165
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

కరకట్టపై బస్‌షెల్టర్ ప్రారంభం



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న దాత సీతారామాంజనేయులు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గుర్విందపల్లి వద్ద కరకట్టపై బస్సుల కోసం వేచివుండే ప్రయాణీకుల కోసం రూ. 2.40 లక్షలతో బాసంశెట్టి రాంగారావు జ్ఞాపకార్థం కుమారుడు బాసంశెట్టి సీతారామాంజనేయులు బస్‌షెల్టర్ నిర్మించారు. ఈ బస్‌షెల్టర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. వర్షానికి, ఎండకు కరకట్టపై ప్రయాణీకులకు నిలువ నీడ లేకపోవటంతో బస్‌షెల్టర్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయభాస్కర్, ఉప సర్పంచ్ పి.నాగ జయరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, కుటుంబ సభ్యులు కుమారి, సాంబశివరావు, పులి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలోని సిద్ధాంతం పెట్రోల్ బంకు వద్ద రెండు ఆటోలు ఢీకొని వలిశెట్టి వనాజీ(50) అనే వ్యక్తి చనిపోయినట్టు ఎస్సై చంటిబాబు గురువారం తెలిపారు. సిద్ధాంతం పెట్రోల్ బంకు నుంచి గుడివాడ వస్తుండగా, గుడ్లవల్లేరు నుంచి వస్తున్న మరో ఆటో క్రాస్ చేసే సమయంలో రెండు ఆటోలు ఢీకొన్నాయన్నారు. వలిశెట్టి వనాజీ ఆటోలో నుంచి కిందపడిపోగా, బలమైన గాయాలయ్యాయన్నారు. దీంతో బాధితుడిని గుడివాడ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారని ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



వలిశెట్టి వనాజీ

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

పెదపారుపూడి: జమిదింటకుర్రులో గురువారం గ్యాస్ సిలెండర్ లీకై గుడివాక వెంకట సుబ్బమ్మ పూరిల్లు అగ్నికి ఆహుతైంది. గృహంలోని గృహోపకరణాలు, వంటసామగ్రి, ఇతర వస్తువులు అన్ని కాలి బూడిదయ్యాయి. గుడివాడక అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించటంతో హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి వచ్చి మంటలను అదుపు చేశారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జగ్గంపూడి ఆంజనేయులు, సిబ్బంది మంటలను అదుపు చేశారు.

కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడ రూరల్: దొండపాడులో కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం ఉదయం విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, ఆకల్మష హోమం, విశ్వశాంతి, నవగ్రహయాగం వంటి పూజలను అర్చకులు చేశారు. 10 గంటలకు హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం గావించారు. సాయంత్రం అజస్ర దీపారాధన, మృత్యుంగ్రహ భూమి పూజ, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కెనాల్‌గట్టు పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు : క్యాంప్ బెల్ కెనాల్ గట్టు బలోపేతం చేసేందుకు గురువారం పనులు ప్రారంభించారు. క్యాంప్ బెల్ కెనాల్ గట్టు చినగొన్నూరు గ్రామ సమీపంలో బలహీనంగా ఉన్నందున ఓఅండ్‌ఎం నిధులు రూ. 5లక్షల అంచనాలతో కట్టలు బలోపేతం చేసేందుకు ఇరిగేషన్‌శాఖ నిధులు మంజూరు చేసింది. 83వ వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శాయిన ప్రసాదరావు పూజలు నిర్వహించి ప్రారంభించారు. పనులను ఇరిగేషన్ వడాలి బ్రాంచ్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

బాగుపడే 'మార్గమే' లేదా...!

● నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - నందివాడ): కుదరవల్లి నుంచి లక్ష్మీ నరసింహాపురం చివరి వరకు గల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ గ్రామం మండలానికి శివారున ఉండటంతో వర్షాకాలం వస్తే రహదారిపై వర్షపు నీరు వరదలా ప్రవహిస్తుంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులకు సర్కస్‌ఫీట్లు చేయక తప్పడం లేదు. పొలుకొండ నుంచి లక్ష్మీనరసింహాపురం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. కుదరవల్లి చెట్లు వద్ద నుంచి లక్ష్మీనరసింహాపురం ఊరిలోకి 2021-22లో రూ.3.50 కోట్లతో రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఈ రోడ్డు బిల్లులకే పరిమితమై, మున్నాళ్ల ముచ్చటగా మిగిలింది. రోడ్డు వేసిన కొన్నాళ్లకే రహదారి ధ్వంసమై గోతులతో నిండిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మైనర్ రిపేర్లు అంటూ సుమారు రూ.40 లక్షలతో మెటల్ రోడ్డుతో సరిపెట్టారన్నారు. దీంతో వాహనాల తాకిడికి రహదారిపై గులకరాళ్లు పైకి తేలాయి. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో పడరానిపాట్లు పడాల్సి వస్తుంది. దీంతో చేసేదేమీ లేక కుదరవల్లి చెట్ల వద్ద చేపల రైతులు తమ సొంత నిధులతో గ్రావెల్ పోసి గోతులు పూడ్చారు. నిత్యం వందల వాహనాలు, చేపల చెరువుల మేతల లారీలు, చేపల పిల్లల తోలకాల వ్యానులు నిత్యావసర సరుకులకు ఆటోలు, బైకులు నిత్యం తిరుగుతూనే ఉంటాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



రహదారి ధ్వంసమై పైకి తేలిన గులకరాళ్లు



గోతులతో నిండిన రహదారి

అధికారులు పట్టించుకోవడం లేదు

కుదరవల్లి నుంచి లక్ష్మీనరసింహాపురం చివరి వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. రహదారికి మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

సింగవరపు బాబురావు , గ్రామస్థుడు

అంచనాలు సిద్ధం చేశాం

రహదారి మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడతాం.

హరి, ఆర్‌అండ్‌బీ ఏఈ



నోటీసులు అందిస్తున్న పంచాయతీ అధికారులు

ఆక్రమణదారులకు నోటీసులు

కూచిపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి బస్టాండ్ చుట్టూ స్థలాన్ని ఆక్రమించుకుని దుకాణాలు నిర్మించుకున్న వారు, ఆ స్థలాలు ఆక్రమించుకుని కాపురాలు ఉంటున్న వారం రోజుల్లో స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని గ్రామపంచాయతీ గ్రేడ్ -1 కార్యదర్శి పుష్పనాథం ఫైనల్ ఆర్డర్ (నోటీసులు) గురువారం ఆక్రమణదారులకు అందజేశారు. సర్వే నెంబర్ 38/1లో పసుమర్తివారి ధర్మచెరువు పోరంబోకు, 38/2లో ఆర్‌అండ్‌బీ మార్జిన్లను ఆక్రమించుకుని దుకాణాలు నిర్మించుకుని కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరికొందరు ఈస్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వీరందరికి నోటీసులు అందించారు. ఏపీ హైకోర్టు గతేడాది ఆక్రమణలు తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పటికే మూడు పర్యాయాలు నోటీసులు ఇచ్చి ఉన్నామన్నారు. అయినప్పటికీ ఆక్రమణదారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో ఫైనల్ ఆర్డర్‌గా గురువారం మరోమారు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారం రోజుల్లో ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్టు అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన తప్పనిసరి

● ఈవోపీఆర్‌డీ అమీర్ మీర్జా బాష

నందివాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న డంపింగ్ యార్డులలో ఎరువుల తయారీ విధానం, గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించే విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి అమీర్ మీర్జా బాష తెలిపారు. మండలంలోని పొలుకొండ పంచాయతీ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలచే చెత్త సేకరణపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా తడి చెత్త ఒక బక్కెట్‌లోను, పొడి చెత్త ఒక బక్కెట్‌లోను, పగిలిన గాజు సీసాలు ఒక బక్కెట్‌లోనూ వేర్వేరుగా వేయాలన్నారు. ప్రతి రోజు చెత్త సేకరణపై ఇంటి చుట్టూ శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఇంటి పన్ను బకాయిలు ఇప్పటి వరకు 75 శాతం అయ్యాయని, మిగిలిన 25 శాతం కూడా కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డ్వాక్రా వీఏవో అనురాధపై డ్వాక్రా సంఘాల లీడర్లు, వీవోఏ అనురాధ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని ఆమెకు ఇష్టమైన వారికే లోన్లు ఇప్పిస్తూ ఫోటోలు తీస్తుందని తెలిపారు. సమస్యలపై సీసీ కృష్ణకుమారికి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఝాన్సీ కుమారి, డీసీ చైర్మన్ బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, ఉప్పల వెంకటేశ్వరరావు, డ్వాక్రా సంఘాల లీడర్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డి అమీర్ మీర్జా బాష

బొడ్డపాడు అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వివక్షకు, అణచివేతకు గురైన బొడ్డపాడు గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తున్నామని, ఈ పది నెలల్లోనే రూ 1.80 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడులో గురువారం పల్లెపండుగా కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ నిధులు రూ. 31.80 లక్షలతో నిర్మించిన సిమెంటురోడ్లను, రూ 7.50 లక్షలతో నిర్మించిన హిందూ శ్మశానవాటికను, పంచాయితీ నిధులు రూ. 3.50 లక్షలతో నిర్మించిన నందమూరి తారక రామారావు రచ్చబండను, రూ. 2.50 లక్షలతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి నిర్మించిన పెన్సింగ్‌ను ఆయన గురువారం ప్రాంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బొడ్డపాడును అభివృద్ధి చేసేందుకు తాను చర్యలు తీసుకుంటున్నానని కుమార్ రాజా అన్నారు. సర్పంచ్ శివశంకర్ , ఉప సర్పంచ్ కె శివశంకర్, మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, కనగాల వెంకట సత్యనారాయణ(చంటి), ఎంపీడీవో రవికాంత్, పీఆర్ ఏఈ శరాబందిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



రచ్చబండ వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

మట్టినమూనా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జ్యోతి రమణి



సమావేశంలో మాట్లాడుతున్న కె.జ్యోతిరమణి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలంలోని మట్టి నమూనాలను వ్యవసాయ శాఖ ద్వారా పరీక్షించుకోవచ్చని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జ్యోతి రమణి పేర్కొన్నారు. గురువారం నాగవరప్పాడు రైతుసేవా కేంద్రంలో మట్టి నమూనాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా రైతులు తమ పొలంలో మట్టిని పరీక్షించినట్లైతే మట్టిలో పోటాష్, నత్రజని ఎంతపాళ్లలో ఉంది, జింక్ తదితర విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు. దాని ప్రకారం పొలంలో సేంద్రీయ ఎరువులు వాడుకోవచ్చన్నారు. ప్రతి రైతూ ఆరోగ్యం కోసం శరీరాన్ని పరీక్షించుకున్నట్టుగానే మట్టినీ హెల్త్ చెకప్ చేయించాలన్నారు. గుడివాడలో మట్టి నమూనా పరీక్షా కేంద్రం త్వరలో అందుబాటులో రానున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవికాలంలో రైతులు మెట్ట దుక్కులు దున్నుకుని కలుపు నివారించుకోవాలని కోరారు. మెట్ట దుక్కులు దున్నటం వల్ల భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు నశిస్తాయని చెప్పారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, డీఆర్‌సీ ఏవో పద్మజ, మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంత లక్ష్మి, ఏఈవో ప్రదీప్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చింతల కాలువకు ఇరువైపుల రైల్వే గేటు విస్తరణ చేయాలి

గుడివాడ, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేటీఆర్ కళాశాల వద్ద గల రైల్వేగేటు, పట్టణంలోని చింతలకాలువకు ఇరువైపులా విస్తరణ చేపట్టాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి. మురళీకృష్ణ కోరారు. గురువారం స్థానిక కేటీఆర్ కళాశాల రైల్వేగేటు వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా భవిష్యత్‌లో సదరు గేటును పూర్తిగా మూసివేస్తే కేటీఆర్ కళాశాల గేటు వద్ద ట్రాఫిక్ విపరీతంగా పెరిగే అవకాశముందన్నారు. గేటు వెడల్పు తక్కువగా ఉండటంతో వాహనాలు దాటేందుకు చాలా సమయం పడుతుందన్నారు. సదరు గేటును 10మీటర్ల మేర వెడల్పు చేయాలన్నారు. పామర్రురోడ్డు పెద్దకాలువ సెంటర్ నుంచి మందపాడు వరకు సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా రహదారి మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేయాలన్నారు. కవిరాజ కళా మందిరం నుంచి చింతల కాలువకు ఇరువైపులా రహదారి అంచుల వరకు విస్తరించి వన్‌వే చేయలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేటు ఎదురుగా ఉన్న ఐఎంఏ హాల్ రోడ్డును బాగు చేయాలని, రహదారిపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సంతకాల సేకరణలో భవిష్యత్ భద్రతా దళం సభ్యులు మహ్మమద్ తాహెర్‌బాషా, జి.పూర్ణచంద్రరావు, పఠాన్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న భవిష్యత్ భద్రతాదళం సభ్యులు

మొవ్వ ఎస్‌టీవోగా రవి

కూచిపూడి : మొవ్వ సబ్ ట్రెజరీ కార్యాలయ అధికారిగా ఎం.రవి బాధ్యతలు చేపట్టారు. గురువారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నేతలు కలసి ఆయనను సత్కరించారు. ఏడాదికిపైగా ఇంచార్జ్ పరిపాలనలో కొనసాగిన ఈ కార్యాలయానికి రెగ్యులర్ అధికారిగా గన్నవరం కార్యాలయం నుంచి పదోన్నతిపై రవి బాధ్యతలు చేపట్టారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.కృష్ణారావు,పి.సీతారామాచార్యులు సభ్యులు ఆదినారాయణరావు, ఎం.అంజయ్య, లక్ష్మీ నీలవేణి, ఎంవి.కృష్ణారావులు కలసి అభినందించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పామర్రు : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. పామర్రు గ్రామపంచాయతీ పరిధిలో గల కంచర్లవానిపురం ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించనున్న విజయగణపతి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు.



నిరసన తెలుపుతున్న ఎంపీపీ గోగం సురేష్, తదితరులు

మండల సమావేశం బాయ్‌కాట్

పెదపారుపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బాలాజీ తమకు తెలపడం లేదని, ప్రోటోకాల్ పాటించటం లేదని ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీ రజని సమావేశం నుంచి బాయ్‌కాట్ చేశారు. మండల కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు వేమూరి మోహన్ మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించటం లేదని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. గురువిందగుంటలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన పథకం కింద మంజూరైన గ్రాంటు విడుదలైన సమాచారం తెలుప లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనతరం సమావేశం బాయ్‌కాట్ చేసి నిరసన తెలిపారు. సర్పంచ్‌లు నాగదేసి సుబ్రహ్మణ్యం, ప్రత్తిపాటి అశ్వర్థన్‌లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం : ఆర్డీవో

గుడివాడ రూరల్ : రాజకీయ పార్టీలు అన్నీ బూత్ లెవల్ ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం ఆర్డీవో అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికలు, పోలింగ్‌బూత్‌లు, ఓటర్ల జాబితా తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. నూతన ఓటర్లు జాయిన్ చేసుకోవటం, ఎవరైనా మరణించిన ఓటర్లను తొలగించటం చేసుకోవాలని రాజకీయ నాయకులకు సూచించారు.గుడివాడ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఆర్‌ఐ నాగబాబు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పాత, కొత్త పెన్షన్ విధానాలను తీసుకురావడం దారుణం

● పెన్షనర్ల సంఘం జేఏసీ నేత భవిరి శంకరనాథ్

గుడివాడ, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రిటైరైన వారిని రెండు విభాగాలుగా విభజించడం వల్ల పదవీ విరమణ చేసిన వారికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఈ రెండు పద్ధతులను వెంటనే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర పెన్షనర్ల సంఘం జేఏసీ నాయకులు భవిరి శంకరనాథ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఏఐబీఎస్ఎన్ఎల్ పీడబ్ల్యూఏ గుడివాడ బ్రాంచ్, రాష్ట్ర పెన్షనర్ల సంఘం, బ్యాంకర్స్, ఎల్ఐసీ, పోస్టల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సంఘం నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సముద్రాల వెంకటేశ్వరరావు, కుమార్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత, కొత్త పెన్షన్‌ల విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కేంద్ర పెన్షనర్లు

మైనార్టీల సంక్షేమమే కూటమి ధ్యేయం

● మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ రబ్బాని

గుడివాడ, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల సంక్షేమమే కూటమి ధ్యేయమని , గుడివాడలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ రబ్బానీ పేర్కొన్నారు. గురువారం స్థానిక పాతబైపాస్ రోడ్డులోని అంజుమన్ భవన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడలోని అంజుమన్ భవన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంచనాలను రూపొందించిన తరువాత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో షాదీఖానా నిర్మాణ పనులనూ త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ(నాని), మున్సిపల్ డీఈ సతీష్ చంద్ర, ఏఈలు రాజేష్, శివాజీ, టీడీపీ నాయకులు షేక్ సర్కార్, షేక్ ఇబ్రహీం, సయ్యద్ మున్వర్, సయ్యద్ జబీన్, రఫీ, రహీం, రబ్బాని, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



షాదీఖానాను పరిశీలిస్తున్న మైనార్టీ వెల్ఫేర్ అధికారి రబ్బాని

కార్పొరేషన్‌లోన్లకు ఇంటర్వ్యూలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్

గుడివాడ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కార్పొరేషన్ల లోన్ల కోసం 392 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రకాల కార్పొరేషన్ల కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల బీసీ కార్పొరేషన్ల కింద 270 మంది, కాపు కార్పొరేషన్ల రుణాల కోసం 80 మంది, కమ్మ కార్పొరేషన్ రుణాల కోసం 13 మంది, రెడ్డి కార్పొరేషన్ కింద ఏడుగురు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కింద 8 మంది, బ్రాహ్మణ కార్పొరేషన్ కింద ముగ్గురు, ఈబీసీ కార్పొరేషన్ కింద ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వివిధ బ్యాంక్‌ల అధికారులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

నందివాడ : ఓసీ, బీసీ అభ్యర్థులు లోన్లు కోసం దరఖాస్తు చేసుకున్న 317 మంది అభ్యర్థులకు గురువారం స్థానిక నందివాడలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో నందివాడ బరోడా బ్యాంక్ మేనేజర్, జనార్థనపురం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో 63 యూనిట్లకు గాను ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు మొత్తం 317 మంది దరఖాస్తు చేసుకోగా, 280 మంది ఇంటర్వ్యూలలో పాల్గొన్నట్టు ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కోటేశ్వరరావు, సురేష్, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ కార్పొరేషన్ రుణాల ఆశావహులతో కిటకిటలాడింది. కార్పొరేషన్ రుణాలకోసం మండల పరిషత్ కార్యాయలంలో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు, ఎంపీడీవో పర్యవేక్షణలో దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు చేశారు. మండలంలో అన్ని కార్పొరేషన్లకు కలిపి 74 యూనిట్లకు అవకాశం ఉండగా 735 దరఖాస్తులు రాగా 582 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీవో టి.విజయ సారథి తెలిపారు.

భూముల రీ సర్వే ప్రారంభం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చాగంటిపాడులో గురువారం వ్యవసాయ భూముల్లో రీ సర్వే కార్యక్రమం ప్రారంభించారు. రీ సర్వే టీడీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక వీఆర్వో కె. బాల కోటయ్య, పలు గ్రామాల వీఆర్వోలు, సిబ్బంది సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డులోని సునీత టవర్స్‌లోని మూడో అంతస్తులోని కిరణ్‌కుమార్ ప్లాట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు చుట్టూ పక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో గ్యాస్ రెగ్యులేటర్, గ్యాస్ ట్యూబ్‌లు మాత్రమే కాలడంతో స్వల్ప నష్టం జరిగింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	145, 154, 165
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

మోపిదేవి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి బాపట్ల జిల్లా కావూరు గ్రామానికి చెందిన తుమ్మల సాయిరాఘవ్ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. గురువారం ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళం అందించారు.



కొమాళ్లపూడి సబ్‌చానల్ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ ఆంజనేయప్రసాద్ తదితరులు

త్వరలో కాల్వలకు నీరు విడుదల

కృత్తివెన్ను, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి అవసరాల నిమిత్తం త్వరలో పంట కాలువలకు నీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. మండలంలో గురువారం పర్యటించిన ఇరిగేషన్ అధికారులు, కొమాళ్ళపూడి సబ్ చానల్ పూడికతీత పనులను పరిశీలించారు. బంటుమిల్లి మెయిన్ కాలువను పరిశీలించారు. డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈఈ దృష్టికి తీసుకెళ్లారు. లక్ష్మీపురం లాకుల వద్ద చెత్తచెదారం పేరుకుపోయిందని, షెల్టర్లు ధ్వంసం కావటంతో ఉప్పునీరు ఎదురువస్తోందని తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపాలని కోరగా, అధికారులు సానుకూలంగా స్పందించారు. డీఈ శ్రీను, ఏఈ రాజ్యలక్ష్మీ, నీటి సంఘం అధ్యక్షులు కూనసాని శ్రీనివాసరావు, తాతాజీ, చిన్నబ్బులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ దుర్గావాణి

మోపిదేవి వార్పులో ఉపాధి పనులు ప్రారంభం

మోపిదేవి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మోపిదేవి వార్పు వద్ద పనులను ఎంపీపీ రావి దుర్గా వాణి ప్రారంభించారు. వార్పు వద్ద దేవుడు చెట్టు సమీపంలో ఉన్న పంటబోదుల తవ్వకం పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనులు చేసే సమయంలో రైతులు దగ్గర ఉండి పనులు చేయించుకోవాలన్నారు. ఎంపీడీవో స్వర్ణభారతి, సర్పంచ్ నందిగమం మేరీ రాణి, ఈవోపీఆర్డీ కె.టి..సుందరి పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్‌లు రవి ప్రసాద్, ప్రసాద్ బాబు

ఇంటర్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఘంటసాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా పరిషత్ పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శ్రీకాకుళం, తెలుగురావుపాలెం సర్పంచ్‌లు ముప్పనేని రవి ప్రసాద్, రాచూరి ప్రసాద్ బాబు నోటు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులందరూ బాగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని, ప్రతిరోజు పత్రికలను చదవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ అడ్మిషన్లు కూడా మొదలు పెట్టామని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు.



గంగానమ్మకు 1,01,108 గారెలు నివేదన

కోడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో ఽ గంగానమ్మ అమ్మవారి 50వ వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా గురువారం భక్తులు 1,01,108 గారెలు అమ్మవారికి నివేదన చేశారు. ఆలయ ప్రాంగణంలో మహాచండీయాగం, 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ధర్మకర్త కోట యుగంధర్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నసమారాధనకు పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు.



శ్మశాన వాటిక అభివృద్ధికి గౌడ సంఘం రూ.లక్ష విరాళం

చల్లపల్లి, ఏప్రియల్ 3 (ఆంధ్రజ్యోతి) : శ్మశానవాటిక అభివృద్ధికి గౌడ రామాలయం, గౌడసంఘం తరఫున సంఘపెద్దలు లక్ష రూపాయల విరాళం అందించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డీఆర్కే ప్రసాద్‌ను కలిసి విరాళం మొత్తాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షుడు వేముల అర్జునరావు, వేముల శేషగిరిరావు, ఉప్పాల ఏడుకొండలు, జన్ను సాంబయ్య, మార్గాని వెంకటేశ్వరరావు, వేముల వెంకట శివ పాల్గొన్నారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ, చల్లపల్లి గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు. శ్మశానవాటిక అభివృద్ధికి సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.





ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కృష్ణా వర్సిటీ వీసీ కె.రాంజీ, విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సమాజంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

ఇంజనీరింగ్ విద్యార్థుల ఫేర్‌వెల్ డేలో వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీర్లే దేశ నిర్మాతలని, సమాజంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ అన్నారు. కృష్ణా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నాల్గో సంవత్సరం పూర్తి చేసుకుని బయటకు వెళుతున్న విద్యార్థులకు గురువారం మూడో సంవత్సరం విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆటపాటలు, సెటైర్లు, స్కిట్లతో సందడి చేశారు. యంగ్‌తరంగ్ కార్యక్రమాల్లో పాల్గొన్న యువత డ్యాన్స్‌లతో ఉర్రూతలూగించారు. ఉపకులపతి రాంజీ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఏ కార్యక్రమమైనా వినూత్న రీతిలో ఉంటాయన్నారు. రెక్టార్ ఎం.వి. బసవేశ్వరరావు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కళాశాల దిన దిన ప్రవర్ధమానమవుతోందన్నారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎన్. ఉష, ఇంజనీరింగ్ కాలేజీ డీన్ వై.కె.సుందరకృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్. విజయకుమార్ తదితరులు సందేశమిచ్చారు.

అలరించిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

నేటి విద్యార్థులే భవిష్యత్తులో భావి భారత ఆశాదీపాలని ట్రాఫిక్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. మచిలీపట్నం నారాయణ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. సీఐ శివకుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమ శిక్షణతో ఎదగాలన్నారు.

ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్ ఏజీఎం శ్రీనివాస్, కిడ్స్ కో ఆర్డినేటర్ సరళ, ప్రిన్సిపాల్ సిహెచ్. సత్యవేణి, వైస్‌ప్రిన్సిపాల్ డి.చందన, కాగిత సాంబశివరావు తదితరులు మాట్లాడారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న డాక్టర్ డీఆర్కే ప్రసాద్, మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిని రాష్ట్రమంతా విస్తరిస్తాం

• స్వచ్ఛాంధ్ర కార్పొషన్ బృందం చల్లపల్లి సందర్శన

చల్లపల్లి, ఏప్రియల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిని రాష్ట్రమంతా విస్తరిస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా గ్రామానికి సంపూర్ణ సహకారం అందించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ మేరకు కార్పొరేషన్‌కు, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. చల్లపల్లి గ్రామాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బృందం గురువారం సందర్శించింది. జిల్లా కలెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్, ఎండీ ఆదేశాల మేరకు పదేళ్లుగా జరుగుతున్న స్వచ్ఛ ఉద్యమం గురించి తెలుసుకుని స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిని రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు తెలియజేసే లక్ష్యంతో కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ నేతృత్వంలోని బృందం చల్లపల్లిలో పర్యటించారు. వేకువ జామునే 3432వ రోజు స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి నేతృత్వంలో స్ఫూర్తివంతంగా సాగుతున్న స్వచ్ఛఉద్యమం గురించి తెలుసుకున్నారు. స్వచ్ఛ కార్యకర్తల నిర్విరామ కృషిని కళ్లారా చూశారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. శ్మశానవాటిక అభివృద్ధి, సంపద తయారీ కేంద్రం నిర్మాణం, మొక్కల పెంపకం, మరుగుదొడ్ల నిర్మాణం, మన కోసం మనం ట్రస్ట్ సేవలు వివరించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ, తడిపొడి చెత్త సేకరణ, వర్మికంపోస్ట్ తయారీ అంశాలను సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు తెలిపారు. మన కోసం మనం ట్రస్ట్ సహకారంతో నిర్మితమైన బహిరంగ మరుగుదొడ్లను పరిశీలించారు. సంపద తయారీ కేంద్రంలో వర్మి కంపోస్టు తయారీ, విక్రయాలను తెలుసుకుని ప్రశంసించారు. పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఈవో సి.వి.ఆనందరావు, ఎంపీడీవో వెంకట రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈ బి.జగత్, స్వచ్ఛాంధ్ర బృందం సభ్యులు ఎస్ఎండీ. జానీ (ప్రాజెక్టు మేనేజర్), జిల్లా కో-ఆర్డినేటర్లు టి.విజయ్, బి.సాయికృష్ణ, చల్లపల్లి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిషేధం, చెట్లను నరకకుండా నియంత్రించటం, కవర్ కేబుల్ తదితర విషయాలపై తమ అభిప్రాయాలను డాక్టర్ డీఆర్కే ప్రసాద్ తెలియజేశారు. పంచాయతీకి స్వీపింగ్ మిషన్, ట్రై సైకిల్స్, ఇంట్రామిషన్ల అవసరాలను సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి మాధవేంద్రరావు తెలిపారు.



డ్వామా పీడీ శివరామప్రసాద్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు చెల్లించాల్సిన రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని డ్వామా పీడీ శివరామప్రసాద్ యాదవ్‌కు వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు వినతిపత్రం సమర్పించారు. గురువారం సంఘ కార్యాలయంలో సంఘ నాయకులు శీలం నారాయణ, ఏ. వెంకటేశ్వరరావు, మోహనరావు, సిహెచ్. జయరావు తదితరులు ఆయనను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతంలోని మంచినీటి చెరువులు, డ్రెయిన్లు, పంటకాలువల్లో తూటుకాడ తొలగింపు ఉపాధి హామీ పనుల్లో చేపట్టాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇచ్చిన విధంగా రూ.450 చెల్లించడంతో పాటు 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.



తహసీల్దార్ పెట్రోల్ బంకుల తనిఖీ

చల్లపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్రోల్ బంకుల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ డి.వనజాక్షి, డీటీ శ్రీలత, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, పీడీఎస్ డీటీ శ్రీనివాస్ వేర్వేరు బృందాలుగా పెట్రోలు బంకులను తనిఖీ చేశారు. బంకులో డిప్ టెస్ట్ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. పెట్రోలు క్వాలిటీ, పరిమాణం చూశారు. నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు అందించారు. బంకుల్లో భద్రతా చర్యలు పాటించాలని తహసీల్దార్ వనజాక్షి ఆదేశించారు.



బండ్రెడ్డి రామారావుకు ప్రముఖుల నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తండ్రి రామారావు సంతాప సభ గురువారం ఉల్లిపాలెంలో జరిగింది. ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మచిలీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, బూరగడ్డ శ్రీకాంత్, ఈమని మణిబాబు తదితరులు పాల్గొన్నారు. బండ్రెడ్డి రామకృష్ణను పలువురు ప్రముఖులు పరామర్శించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులకు అవగాహన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత అన్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో గురువారం ప్రత్యేక అవసరాలు గల తల్లిదండ్రులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. పిల్లలకు మాటలు సరిగా రాకపోవడం, పేరుతో పిలిచినా స్పందించక పోవడం, ఇతర పిల్లలతో కలవకుండా ఒంటరిగా ఉం డటం, వయస్సుకు తగ్గ మానసిక ఎదుగుదల లేకపోవడం ఆటిజం లక్షణాలన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ శ్రీలక్ష్మి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హారిక, డాక్టర్ భార్గవి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్వేత, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పరిరక్షించాలి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలు దిగజారిపోతున్న తరుణంలో సమాజాన్ని మంచి మార్గంలో నడిపించేందుకు దివ్యజ్ఞాన సమాజం ప్రతినిధులు ముందుకురావాలని ప్రముఖ ఆడిటర్ సి.శేషాచార్యులు (అప్పాజీ) అన్నారు. ఈడేపల్లిలో దివ్యజ్ఞాన సమాజం సర్వసభ్య సమావేశంలో సీనియర్ సభ్యులు గుడిసేవ మురళీధర్, నవరం వెంకటేశ్వరరావు, కొత్తగుండు రమేష్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం. సత్యనారాయణ, కారుమూరి రాజేంద్రప్రసాద్, ఉడత్తు శ్రీనివాసరావు, ఎం.వి.వి. రామాంజనేయులు, లంకిశెట్టి బాలాజీ ప్రసంగించారు.



ఉప్పలకలవగుంటలో మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏవో

మట్టి పరీక్షలతో అధిక దిగుబడులు

పెడన రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే మట్టి పరీక్షలు తప్పనిసరి అని డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా కృషి విజ్ఞాన కేంద్రం సర్వపోషక విభాగం పరిశోధకులు ఉప్పల కలవగుంట గ్రామంలో రైతులతో కలసి వ్యవసాయ భూమును పరిశీలించారు. ప్రతి రెండు సంవత్సరాలకోసారి సాగు భూముల్లో మట్టి నమూనాలను పరీక్షించి అవసరాలకనుగుణంగా ఎరువులు వినియోగించాలని వెంకటలక్ష్మి అన్నారు. మట్టిలో ఉదయజని, లవణ, సూక్ష్మ సేంద్రియ మోతాదులకు తగ్గట్టుగా పచ్చిరొట్ట , సేంద్రియ, రసాయన ఎరువులు వాడితే ఖర్చులు తగ్గి రైతులకు లాభాలు వస్తాయన్నారు. ఏవో నూరున్నీసా రాము, పద్మావతి రైతులు పాల్గొన్నారు.

దిరిశవల్లి, ముచ్చిలిగుంటలో భూముల రీ సర్వే

పెడన రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దిరిశవల్లి, ముచ్చిలిగుంట గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. దిరిశవల్లి, కుమ్మరిగుంటలో ఏర్పాటు చేసిన గ్రామసభలలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ దిరిశవల్లిలో 390 ఎకరాలు, ముచ్చిలిగుంటలో 378 ఎకరాల వ్యవసాయ భూములున్నాయన్నారు. ఆయా భూముల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. భూయజమానులు ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. రీ సర్వే డీటీ సల్మా, సర్పంచ్‌లు భవాని, జోగి వెంకటేశ్వరమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాకు చిక్కిన అరటితోటలో పేకాటరాయుళ్లు

మోపిదేవి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ కెమెరాలతో పేకాటరాయుళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్న సంఘన నాగాయితిప్ప గ్రామంలో జరిగింది. అరటి తోటల మధ్య పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను డ్రోన్ కెమెరాతో గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్సై వై.సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద రూ.5420 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం చొరవ



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై నాగరాజు, దాత సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామంలో బుధవారం టీడీపీ నాయకుడు కొండేటి సుబ్రహ్మణ్యం రూ. 20 వేల విలువ గల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉండే సెంటర్‌లో కెమెరాలను రూరల్ ఎస్సైలు నాగరాజు, సత్యనారాయణ పరిశీలించారు. ఎస్సై నాగరాజు మాట్లాడుతూ, గ్రామంలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా దొంగతనాలకు పాల్పడితే సీసీ కెమెరాలు సులభంగా కనిపెడతాయన్నారు. కొనకళ్ళ మధుసూదనరావు, తలారి రవి, గణేష్, రామారావు, ప్రసాద్, కొనకళ్ళ నవరంగ్ తదితరులు పాల్గొన్నారు.